# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
గురువారం
10-10-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 290
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa




## ఇక నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా

2028 డిసెంబర్ వరకు ఉచిత బియ్యం పంపిణీ

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన కింద ఫోర్టిఫైడ్ రైస్

లోథాల్‌లో 'నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్' అభివృద్ధి

కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం

వివరాలు 6లో

# రతన్ టాటా ఇకలేరు

రతన్ టాటా 1937-2024

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా కన్నుమూత

అనారోగ్యంతో ముంబై బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుదిశ్వాస

7


టాటా గ్రూపును 10 వేల కోట్ల డాలర్ల సామ్రాజ్యంగా విస్తరింపజేసిన సమర్థ వ్యాపారవేత్త.. దాతృత్వంలో మేటి

భారత ఆటోమొబైల్ సంస్థలకు కార్లు తయారు చేసే సత్తా లేదన్న అపప్రథకు 'ఇండికా' కారు తయారీతో అడ్డుకట్ట

నష్టాల్లో ఉన్న బ్రిటన్ కంపెనీలు జాగ్వార్, లాండ్రోవర్లను కొని లాభాలబాటలోకి నడిపించిన నాయకుడు

సూది నుంచి విమానం దాకా ఆకాశమే హద్దుగా విస్తరించిన వాణిజ్య విశ్వరూపం తనువు చాలించింది

స్వతంత్ర భారత పారిశ్రామిక రంగంలో ఒక శకం ముగిసింది





## నేడు సద్దుల బతుకమ్మ

భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ట్రాఫిక్ ఆంక్షలు విధించిన నగర పోలీసులు

మహిళలకు సీఎం రేవంత్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్):** నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించాని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసింది. నేడు సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలను నిరహించనున్నారు. బాణాసంచా కాల్పులు, లేజర్ షోలు ప్రత్యేక ఆకర్శణగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా గురువారం నాడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో అమరవీరుల స్మారక స్థూపం నుంచి అప్పర్ ట్యాంక్ బండ్‌లోని బతుకమ్మ ఘాట్ వరకూ ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఓ ప్రకటనలో వెల్లడించారు. గురువారం రోజు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11గంటల వరకూ ఆంక్షలు అమలులో ఉంటాయని చెప్పారు. ఈ ప్రాంతాల గుండా వెళ్లే ప్రయాణికులు ఇతర మార్గాలను చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆంక్షలు ఉన్న ప్రాంతాలు, దారి మళ్లింపు గురించి వెల్లడించారు. ఇక్బాల్ మినార్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే వాహనాలను తెలుగు తల్లి ఫ్లైఓవర్ వైపు మళ్లించనున్నారు. రాణిగంజ్ నుంచి నెలకెస్ రోడ్ వైపు వచ్చే వాహనదారులను నల్లగుట్ట క్రాస్ రోడ్ వద్ద మినిస్టర్ రోడ్ వైపునకు మిగతా 2లో...

## తెలంగాణ పునర్నిర్మాణంలో.. టీచర్లే కీలకం

సమాజానికి సమర్థులైన పౌరులను అందించండి

వారిని తీర్చిదిద్దే బాధ్యత టీచర్లుగా మీపైనే ఉంది

సమాజంలో బడులే కీలక భూమిక పోషించాలి

ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతామంటున్నారు

తెలంగాణ సమాజంపై ఎందుకింత కోపం?..

కొరివి దయ్యాన్ని నమ్ముకోవడం వల్లనే ఉద్యోగాలు రాలే

ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగు పర్చేలా చర్యలు

డిఎస్సీ నియాక పత్రాల అందచేతలో సీఎం రేవంత్



**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్):** సమర్థులైన పౌరులను తీర్చిదిద్దే బాధ్యత కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న టీచర్లపైనే ఉందని, పాఠశాలలు అందుకు వేదిక కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మీకు వచ్చిన ఈ బాధ్యతను సమర్థంగా ఉపయోగించి సమాజానికి మంచి పౌరులను అందించాలన్నారు. కేసీఆర్ ఇంట్లో ఉద్యోగాలు ఊడగొట్టడం వల్లనే ఇవాళ తెలంగాణలో కొలువుల జాతర సాగుతోందన్నారు. డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలను సీఎం రేవంత్ స్వయంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండని సూచించారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. మిగతా 2లో...



## కాంగ్రెస్‌వన్నీ విభజన రాజకీయాలు

హర్యానా ఫలితాలపై వక్రభాష్యాలు

మండిపడ్డ ప్రధాని మోడీ

రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన

వివరాలు 7లో

## హర్యానా ఫలితాలను విశ్లేషిస్తున్నాం

జమ్మూకశ్మీర్ ప్రజలకు కృతజ్ఞతలు

ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం

ఎక్స్‌లో పోస్ట్ చేసిన కాంగ్రెస్ నేత రాహుల్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 :** ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ హరియాణాలో కాంగ్రెస్ ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఫలితాలపై మిగతా 7లో...

## ఆదాయం పెరగాలి

ధరాభారం వద్దు.. ఖజానా కళకళలాడాలి!

ఆదాయ మార్గాలను అన్వేషించాలి

శాఖలు సమన్వయంతో పని చేయాలి

అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం

మూసీ పరివాహక ప్రజల బాగు కోసమే..

మూసీ ప్రక్షాళన : భట్టి



**హైదరాబాద్, అక్టోబరు 9 (మనం న్యూస్):** 'ప్రజలపై ధరల భారం పడకూడదు.. కానీ, ఖజానాకు ఆదాయం పెరగాలి.. అలాంటి మార్గాలను అన్వేషించండి' అని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ధరలు పెంచకుండా రాబడి పెరిగే మార్గాలను కనుగొనాలన్నారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని పెంచే అంశంపై నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో భట్టి సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్దేశించుకున్న ప్రణాళికలు, వాటి ప్రగతిని నివేదించాలని అధికారులకు చెప్పారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేయాలని చెప్పారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇసుక రీచ్‌ల ద్వారా ఖజానాకు గరిష్ఠ ఆదాయం సమకూరేందుకు ఏం చేయాలనేదానిపై నివేదిక ఇవ్వాలన్నారు.

### మూసీ పరివాహక ప్రజల బాగు కోసమే..

మూసీ పరివాహక ప్రజల బాగు కోసమే.. మూసీ ప్రక్షాళన, అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలు, దూరదృష్టిని నదీ పరివాహక ప్రాంతాల వాసులకు వివరించాలని భట్టి అధికారులకు చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ రీహాబిలిటేషన్‌పై పురపాలక శాఖ ఉన్నతాధికారులతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లతో మిగతా 2లో...

## పోలీసులు 24 గంటలు ప్రజలను కాపాడతారు

రాష్ట్రంలోనే 12 బెటాలియన్‌కు మంచి పేరు ఉంది

బెటాలియన్‌లో సీసీ రోడ్లు వేస్తాం

అందుకు 60 లక్షలు మంజూరు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ, అక్టోబర్ 9 (మనం ప్రతినిధి):** రాష్ట్రంలోనే 12 బెటాలియన్‌కు మంచి పేరు ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రం అన్నేపర్తి వద్ద ఉన్న 12 వ స్పెషల్ పోలీస్ బెటాలియన్ లో నిర్వహించిన ఇంటర్ కాయి గేమ్స్ స్పోర్ట్స్ మీట్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోలీసులు 24 గంటలు ప్రజలను కాపాడే వారని, అలాంటి పోలీసు ఉద్యోగులకు, పోలీస్ శాఖకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. 12వ బెటాలియన్‌లో సిసి రహదారుల నిర్మాణానికి 60 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. అలాగే 12వ బెటాలియన్‌లోని పోలీసులకు సంబంధించి పెండింగ్లో ఉన్న డిఎ, సరెండర్ వంటివి మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.12వ బెటాలియన్ కు సమీపంలో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన 3ఎకరాల స్థలంలో 25కోట్ల రూపాయలతో పర్యటకశాఖ ద్వారా హరిత హోటల్‌ను నిర్మించనున్నామని, 12వ బెటాలియన్ ఉద్యోగులు చిన్న చిన్న ఫంక్షన్లు, వివాహాల వంటివి అందులో చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాక ఇటువైపున మహాత్మా గాంధీ మిగతా 2లో...

## మూసీ పేరిట లక్ష కోట్ల దోపిడీకి యత్నం



రాహుల్, వాళ్ల బావకు దోచిపెట్టే ప్రయత్నం

నియామకాలపైనా నీతిమాలిన ప్రచారం: కేటీఆర్

**హైదరాబాద్, అక్టోబరు 9 (మనం న్యూస్):** 'మూసీ ప్రక్షాళన పేరిట లక్ష కోట్లు దోపిడీ చేసేందుకు కాంగ్రెస్ సర్కారు చూస్తోంది. రాహుల్ గాంధీతోపాటు వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచిపెట్టాలని ప్రయత్నిస్తోంది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి బుల్డోజర్ పాలన తీసుకొచ్చారని దుయ్యబట్టారు. వరంగల్లో ఓ ఎమ్మార్వో బతుకమ్మ ఘాట్ చూసేందుకు మిగతా 2లో...

## ఎమ్మార్పీఎస్ ర్యాలీ ఉద్రిక్తం

ఎస్సీ వర్గీకరణ చేయకుండా టీచర్ల నియామక పత్రాలు ఇవ్వడంపై నిరసన

కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట

మందకృష్ణ మాదిగ సహా పలువురి అరెస్టు

2



మనం



# నేడు సద్దుల బతుకమ్మ

మొదటి పేజీతరువాయి...

మళ్లిస్తారు. మినిస్టర్ రోడ్ నుంచి నెలకెస్ రోడ్ వైపు వచ్చే వారిని నల్లగుట్ట క్రాస్ రోడ్ వద్ద రాణిగంజ్ వైపు మళ్లిస్తారు. లిబర్టీ నుంచి ఎగువ ట్యాంక్ బండ్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను పాత అంబేడ్కర్ విగ్రహం వద్ద ఇక్బాల్ మినార్ వైపు మళ్లిస్తారు. సికింద్రాబాద్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను కర్బలా మైదాన్ వద్ద బైబిల్ హౌస్ వైపునకు మళ్లిస్తారు. ధోబీ ఘాట్ నుంచి చిల్డ్రన్స్ పార్క్/అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే వారిని డీబీఆర్ మిల్స్ వద్ద కవాడిగూడ క్రాస్ రోడ్ వైపునకు పంపిస్తారు. డీబీఆర్ మిల్స్ నుంచి వచ్చే ప్రయాణికులను కవాడిగూడ క్రాస్ రోడ్ వద్ద జబ్బార్ కాంప్లెక్స్, సీజీవో టవర్స్ వైపు మళ్లించనున్నారు. సెయిలింగ్ క్లబ్ వైపు వెళ్లాలనుకునే సీజీవో టవర్స్ నుంచి వచ్చే వాహనదారులను కవాడిగూడ క్రాస్ రోడ్ వద్ద డీబీఆర్ మిల్స్, జబ్బార్ కాంప్లెక్స్ వైపు మళ్లిస్తారు. సికింద్రాబాద్ నుంచి ట్యాంక్ బండ్ మీదుగా వెళ్లే అన్ని అంతర్ జిల్లా ఆర్టీసీ బస్సులు స్వీకర్ ఉపకార్ జంక్షన్ వద్ద సంగీత్ మెట్టుగూడ తార్నాక నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ క్రాస్ రోడ్ బర్కత్‌పురా టూరిస్ట్ హోటల్ నింబోలి అడ్డా చాదర్‌ఘాట్ వద్ద మళ్లించబడతాయి. ట్యాంక్ బండ్ వైపు వచ్చే సిటీ బస్సులను కర్బలా మైదాన్ వద్ద బైబిల్ హౌస్ వైపునకు మళ్లించనున్నారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రయాణికులు పాత అంబేడ్కర్ విగ్రహం, కవాడిగూడ క్రాస్‌రోడ్స్, కట్ట మైసమ్మ, కర్బలా మైదాన్, రాణిగంజ్, నల్లగుట్ట, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ జంక్షన్ల వైపు వెళ్లొద్దని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అలాగే సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా ట్యాంక్ బండ్‌కు వాహనాల్లో వచ్చే ప్రజలకు పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ మార్గ్‌లోని రేస్ కోర్స్ రోడ్డు, జీహెచ్‌ఎంసీ కార్యాలయం బీఆర్కే భవన్ మధ్య రహదారి, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్‌పై పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. దయచేసి నేడు జరిగే వేడుకలకు వాహనదారులు, ప్రయాణికులు సహకరించాలని నగర ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

### మహిళలకు సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

రాష్ట్రంలోని మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తీరొక్క పూలతో రూపొందించే ఘనమైన బతుకమ్మలతో ఆడిపాడే సంబురాల్లో ఆఖరి రోజైనా సద్దుల బతుకమ్మను వైభవంగా జరుపుకోవాలని సూచించారు. పెద్ద బతుకమ్మ సందర్భంగా ట్యాంక్‌బండ్‌తో పాటు రాష్ట్రంలోని చెరువులన్నింటి వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి సైతం మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదాయం పెరగాలి



మొదటి పేజీతరువాయి...

ఆయన సమీక్ష నిర్వహించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజల్ని బీఆర్‌ఎస్ సర్కారులా గాలికి వదిలేయబోమన్నారు. వారికి ఏ సాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మూసీ గర్భంలో నివసిస్తున్న ప్రజలను అక్కడి నుంచి దూరంగా పంపించబోమని చెప్పారు. మూసీకి దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రతిపక్ష పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల్లో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే హైదరాబాద్ నగరానికి నష్టం చేసిన వారవుతారని భట్టి అన్నారు. నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తే తాము స్వీకరిస్తామని చెప్పారు.



# తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్లే కీలకం

మొదటి పేజీతరువాయి...

సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొఱవి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం అని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్‌ఎస్‌కు ఎందుకంత కోపం? ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్‌ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్‌ఎస్‌కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరని మరోమారు స్పష్టం చేశారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారంభించాం. స్కిల్ వర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యం అందిస్తున్నాం. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశాం. నాలుగు కోట్లు జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో ఒలింపిక్స్‌లో ఎందుకు పతకాలు రాలేదు? తెలంగాణ యువత మత్తుకు బానిసలయ్యారు. వ్యసనాలకు బానిసలై.. యువత తప్పుదోవ పడుతున్నారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు బంగారు పతకాలు రావాలని పిలుపునిచ్చారు.

### కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం: భట్టి



కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. దశాబ్ద కాలం డీఎస్సీ గురించి ఆలోచన చేయలేదని ఆక్షేపించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే తపనతోనే టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. ప్రతిపక్షం డీఎస్సీపై ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా, ఆటంకాలు సృష్టించినా అనుకున్న సమయానికి డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ఏళ్ల తరబడి పదోన్నతులు, బదిలీల్లేక టీచర్లు ఇబ్బందులు పడ్డారు. మా ప్రభుత్వం రాగానే టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసింది. డీఎస్సీపై ప్రతిపక్షం చాలా కుటిల ప్రయత్నాలు చేసింది. అయినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్ర మార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, సిఎస్ శాంతికుమారి, ఆచార్య కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ర్యాలీ ఉద్రిక్తం

**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్) :** ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11వేల మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మార్పీఎస్ బుధవారం చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. ఎమ్మార్పీఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాటలు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సహ పలువురు నేతల అరెస్టులతో సాగింది. హైదరాబాద్, పార్సీగుట్టలోని ఎమ్మార్పీఎస్ కేంద్ర కార్యాలయం నుంచి ఇందిరా పార్కు వరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీని ఇందిరా పార్కు సిగ్నల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు, పోలీసులు మధ్య మొదలైన వాగ్వాదం తోపులాటకు దారి తీసింది. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో మంద కృష్ణ మాదిగ సహ పలువురిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టు సందర్భం గా మందకృష్ణ మాదిగ విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వడం వల్ల ఎంతో మంది మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించి న ముఖ్యమంత్రి మాదిగలను మోసం చేశారని మండిపడ్డారు. మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు నమ్మకం ద్రోహం చేసిన ముఖ్యమంత్రికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు కొమ్ముకాస్తుందని మరోసారి రుజువైందని ఆరోపించారు. అక్టోబరు 15న ఎమ్మార్పీఎస్, అనుబం ధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని మందకృష్ణ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, జాతీయ కార్యదర్శి తిప్పారపు లక్ష్మణ్, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో 25 వేల కోట్లు జమ

### గత పదేళ్ల కష్టాల నుంచి విముక్తి: కోదండరెడ్డి

### వ్యవసాయ కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, అక్టోబరు 9 (మనం న్యూస్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే రైతుల ఖాతాల్లో రూ.25 వేల కోట్లు జమ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.కోదండరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం బీఆర్కే భవన్‌లో వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్, రైతుసంఘం నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఒక పంటకు పెట్టుబడి సాయం అందించడంతోపాటు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని అన్నారు. రైతులను రుణ విముక్తులను చేయడంతోపాటు వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాల ద్వారా వారికి తోడునీడగా ఉంటామని కోదండరెడ్డి చెప్పారు.

## మండలి చీఫ్‌విప్‌గా పట్నం బాధ్యతలు స్వీకరణ

### అభినందనలు తెలిపిన పలువురు నేతలు

**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్):** రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్‌గా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. అసెంబ్లీ సెక్రటరీ నరసింహచార్యులు సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలవగా, ఆయన మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ ,ఈర్లపల్లి శంకర్, మల్ రెడ్డి రంగారెడ్డి, మ్మెల్సీలు కోదండరాం, బల్మూరి వెంకట్, ఎగ్గే మల్లేష్, భాను ప్రకాష్, ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన నాయకులు వజ్రేష్ యాదవ్ , చరణ్ కౌశిక్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి రామ్మోహన్ గౌడ్, రోహిన్ రెడ్డి కొలను హనుమంత్ రెడ్డి, భీమ్ భరత్, పట్నం రినీష్ రెడ్డి, తదితరులు మహేందర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మూసీ పేరిట లక్ష కోట్ల దోపిడీకి యత్నం

మొదటి పేజీతరువాయి...

వెళ్తే ఇళ్లు కూలగొట్టేందుకు వచ్చారనుకొని ప్రజలు తరమి కొట్టారంటే.. ఎంత భయాందోళన చెందుతున్నారో అర్థమవుతుందన్నారు. తెలంగాణలో దసరా పండుగను ఘనంగా జరుపుకొనే వీల్లేకుండా భయానక వాతావరణం సృష్టించారని విమర్శించారు. కాంగ్రెస్ పది నెలల పాలనలో అన్నీ వైఫల్యాలేనని, రాష్ట్రంలోని అన్ని వర్గాలు అసంతృప్తితోనే ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ నేత మహ్మద్ అల్లావుదీన్‌తోపాటు పలువురు నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరగా.. కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య అయినా కలెక్టర్లకు చెప్పాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని, ఆ ఫలితాలు చూసైనా రాహుల్గాంధీ, రేవంత్‌రెడ్డి హామీల అమలుకు కృషి చేయాలని సూచించారు. కొడంగల్లో రైతుల పక్షాన పోరాడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. భూ సేకరణలో ప్రజల భయాలు, అనుమానాలను నివృత్తి చేసి వాళ్లను ఒప్పించాల్సింది పోయి.. పోలీసులను అడ్డు పెట్టుకొని అరాచకం సృష్టించడమేంటని నిలదీశారు. కాగా, ఉద్యోగ నియామకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీతిమాలిన ప్రచారం చేసుకొంటోందని 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రక్రియను వారి ఖాతాలో వేసుకోవడానికి కొంచెమైనా సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డిని చూస్తే గోబెల్స్ మళ్లీ పుట్టాడనిపిస్తోందని విమర్శించారు. అశోక్‌నగర్ చౌరస్తా, ఉస్మానియా క్యాంపస్‌కు వెళ్లి కొలువుల పండుగ కథలు చెబుతావా? అని ప్రశ్నించారు. కాగా, జ్యోతి బాపూలే విదేశీ విద్య పథకానికి కాంగ్రెస్ తూట్లు పొడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

## గ్రూప్1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల

### 21 నుంచి 27 వరకు మెయిన్ పరీక్షలు

### మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు నిర్వహణ

**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్):** తెలంగాణలో 'గ్రూప్1' మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. అక్టోబరు 21 నుంచి 27వరకు గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించ నున్నారు. ఆయాతేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. అయితే మధ్యాహ్నం 12:30 నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం1.30 తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరు. గ్రూప్1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను అక్టోబరు 14 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో పొందుపరిచిన అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 563 గ్రూప్1 పోస్టుల భర్తీకి 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఎగ్జామ్‌కు మొత్తం 3.02 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఫలితాలను జులై 7న విడుదల చేశారు. ఇందులో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్1 మెయిన్స్‌కు అర్హత సాధించారు. వీరికి అక్టోబరు 21 నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్1 మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లు ఉంటాయి. ప్రతీ పేపర్‌ను 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 3 గంటలు. మెయిన్ పరీక్షలను ప్రతీ రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్ తప్ప మిగిలిన పేపర్లను అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాలి. గ్రూప్1 మెయిన్స్‌లో మొత్తం 06 పేపర్లు ఉంటాయి. వీటిని అభ్యర్థి ముందుగా ఎంచుకున్న మాధ్యమంలోనే రాయాల్సి ఉంటుంది. పేపర్‌లో కొంత భాగాన్ని ఇతర భాషలో రాయడానికి అభ్యర్థికి అనుమతి లేదు.

# రూ.79.57 కోట్ల పంట నష్ట పరిహారం విడుదల

### గత నెలలో భారీ వర్షాలకు 79 వేల ఎకరాల్లో నష్టం

### రైతుల ఖాతాల్లోనే నిధులు జమ చేస్తాం: మంత్రి తుమ్మల

### పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 9 (మనం న్యూస్):** గత నెలలో కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రూ.79.57కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎకరాకు రూ.10వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాల్లో 79,574 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. కాగా, ఈ ఏడాది మార్కెట్‌కు 25.33 లక్షల టన్నుల పత్తి వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో పత్తి విక్రయాల పర్యవేక్షణకు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసి, వాటి సజావుగా విక్రయాలు జరిగేట్లు పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా టెండర్లలో పాల్గొన్న 319 జిన్నింగ్ మిల్లులను గుర్తింపు కొనుగోలు కేంద్రాలుగా ప్రకటించే అధికారాన్ని ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించాలని పేర్కొన్నారు. రైతులు ఏ కేంద్రానికి వెళ్తే త్వరగా అమ్ముకునేందుకు అవకాశం ఉందనే వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు. పత్తిని విక్రయించే రైతులు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డును కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లాలని, ఆధార్‌తో అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాకు నగదు చెల్లింపులు ఉంటాయని తెలిపారు. కాగా, మరో 7 వ్యవసాయ మార్కెట్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్లు, పాలకవర్గ సభ్యులుగా ఎంపికైన వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీసులు 24 గంటలు ప్రజలను కాపాడతారు

మొదటి పేజీతరువాయి...

యూనివర్సిటీ ఉందని, 2004లో ఏర్పాటు చేసిన యూనివర్సిటీకి నెల రోజుల్లో కొత్త వైస్ ఛాన్సలర్‌తో పాటు, ఎగ్జిక్యూటివ్ కమిటీ రానున్నదని, మహాత్మా గాంధీ యూనివర్సిటీకి బడ్జెట్‌ను, మౌలిక సదుపాయాలను కల్పించి పటిష్టం చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు నింపి బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టును పూర్తి చేస్తానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా గడచిన 3రోజులుగా బెటాలియన్ లో నిర్వహించిన కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ అథ్లెటిక్ పోటీలలో గెలుపొందిన వారికి మంత్రి జ్ఞాపికలను అందజేశారు. 12వ బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, 12వ బెటాలియన్ పోలీస్ అధికారులు, డిఎస్పి శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు ఈ గేమ్స్ స్పోర్ట్స్ మీట్ కు హాజరయ్యారు.

## ఎస్సీ వర్గీకరణ అమలుకు నిర్ణయం

### ఏకసభ్య కమిషన్ ఏర్పాటుకు సీఎం ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్):** తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 60 రోజుల్లో నివేదిక ఇచ్చేలా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక వచ్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని సీఎం సూచించారు. 24గంటల్లో కమిషన్‌కు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వివిధ అంశాలపై చర్చించిన క్యాబినెట్ సబ్ కమిటీ.. నాలుగోసారి సమావేశమై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు సమావేశమై చర్చించి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కేబినెట్ సబ్ కమిటీ సూచనల ఆధారంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణపై 60 రోజుల్లో వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## సున్నాకే పరిమితమైనా బుద్ధి మారలేదు

### బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం

### ప్రతిపక్షంగా మంచి సూచనలు ఇవ్వాలని హితవు

### గాంధీభవన్లో 'మంత్రితో ముఖాముఖి'కి హాజరు

**హైదరాబాద్, అక్టోబరు 9 (మనం న్యూస్):** లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు సున్నాకే పరిమితం చేసినా.. ఆ పార్టీ నేతల బుద్ధి మారలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రభుత్వానికి మంచి సూ చనలు, సలహాలు ఇవ్వాలని హితవు పలికారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని కేటీఆర్ను నిలదీశారు. గాంధీభవన్లో 'మంత్రితో ముఖాముఖి'లో భాగంగా బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి ఫిర్యాదులు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందంటూ కొంత మంది ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇకనైనా వారు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పది నెలల పాలనపై చర్చకు సిద్ధమంటున్న జగదీశ్‌రెడ్డి.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. బీజేపీ తానా అంటే బీఆర్ఎస్ తందానా అన్నట్టుగా వ్యవహరిస్తోందన్నారు. ఎవరెన్ని సెటైర్లు వేసినా ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. 'మంత్రితో ముఖాముఖి'లో ఇందిరమ్మ ఇళ్లు త్వరగా ఇవ్వాలని, ఉద్యోగ నియామకాలను వేగవంతం చేయాలని విజ్ఞప్తులు అందాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా తాము చెప్పిందే వినాలని కాకుండా.. ప్రజలందరి అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో 179 మంది వినతి పత్రాలు అందజేశారు. పలు విజ్ఞప్తులపై జిల్లాల అధికారులకు ఫోన్ చేసిన మంత్రి.. సదరు సమస్య పరిష్కరించాలని సూచించారు. కాగా, దసరా నేపథ్యంలో శుక్రవారం జరగాల్సిన 'మంత్రితో ముఖాముఖి' రద్దయింది. మళ్లీ బుధవారం ఈ కార్యక్రమం ఉంటుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

## ఏరోస్పేస్ కంపెనీలకు అత్యుత్తమ గమ్యస్థానం తెలంగాణ!

### ఐటీ మంత్రితో 90 మంది ప్రతినిధుల భేటీ

### పెట్టుబడులు పెట్టండి: శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబరు 9 (మనం న్యూస్):** ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానమని ఫ్రెంచ్ ఏరోస్పేస్ పరిశ్రమల సంఘం ప్రశంసించింది. ఇప్పటికే ఇక్కడ ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టి విజయవంతంగా కొనసాగుతున్నాయని గుర్తుచేసింది. సంఘం నేతృత్వంలో ఫ్రాన్స్ ఏరోస్పేస్ కంపెనీలకు చెందిన 90మంది ప్రతినిధుల బృందం బుధవారం నగరంలో పర్యటించింది. రాష్ట్రంలో ప్రస్తుతమున్న కంపెనీలతో పాటు పెట్టుబడులకున్న అవకాశాలను పరిశీలించింది. అనంతరం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. హైదరాబాద్లోని ఫ్రాన్స్ డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సఫ్రాన్, ఎయిర్‌బస్, బోయింగ్, లోఖీడ్ మార్టిన్, జీఈ ఏవియేషన్, రేథియాన్ లాంటి ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. నగరంలో ఫ్రెంచ్ కంపెనీలతో ఎప్పటినుంచో వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫ్రెంచ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ ఏడీపీ వాటాదారుగా ఉందని గుర్తుచేశారు. మేకిన్ ఇండియా పథకంలో భాగంగా సి-295 ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్ కోసం టాటా భాగస్వామ్యంతో ఎయిర్బస్ హైదరాబాద్‌లో కీలకమైన భాగాలు, సబ్‌సిస్టమ్లు తయారు చేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ధ్రువ స్పేస్, స్కైరూట్ వంటి అంతరిక్ష స్టార్టప్‌లు ఇప్పటికే ఫ్రెంచ్ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నాయని మంత్రి వివరించారు.

నల్గొండ

Follow :
@Manamnews

మనం

గురువారం | హైదరాబాద్
10 10 2024



# పవర్ గ్రిడ్ ద్వారా 1.50 కోట్ల సిఎస్ఆర్ నిధులు మంజూరు







**సూర్యాపేట, అక్టోబర్ 09(మనం ప్రతినిధి) :** జిల్లాలో పవర్ గ్రిడ్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) ఫండ్స్ కింద 1.50 కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో ఒప్పంద పత్రాలపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అలాగే పవర్ గ్రిడ్ సి యండి అరుణ్ కుమార్ సంతకాలు చేసినారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నిధులతో జిల్లాలో అంగన్వాడీ భవనాలు, పంచాయతీ కార్యాలయాలు , పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించుటకు ఉప యోగిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్. కిషన్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు**

జిల్లా ప్రజలకు,సిబ్బందికి ముందుగా బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు సంస్కృతి, సంప్రదాయాలకి ప్రతీకగా తెలంగాణలో బతుకమ్మ పండుగ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన బతుకమ్మ సంబరాల్లో ముఖ్య అతిధిగా సతీమణితో కలిసి జిల్లా కలె క్టర్ గౌరవమ్మకి పూజలు నిర్వహించి, బతుకమ్మ సంబరాలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు,సిబ్బందికి ముందుగా బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా ప్రజలు, సిబ్బంది ఎప్పుడు ఆడుతూ, పాడుతూ సంతోషంగా ఉండాలన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకి ప్రత్యేకమని ప్రకృతిలో లభించే పూలను సేకరించి అందంగా బతుకమ్మ పేర్చి పూజిస్తారని, చిన్న పెద్దలందరు తొమ్మిది రోజులు పాటు పాటలు పాడుకుంటూ బతుకమ్మ వేడుకలు జరు పుకోవడం జరుగుతుందన్నారు అనంతరం అదనపు కలెక్టర్ బి ఎస్ లత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రము లో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ నేడు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని సిబ్బందితో బతుకమ్మ ఆడటం చాలా సంతోషంగా ఉందని అదనపు కలెక్టర్ అన్నారు. తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారులు పాడే పాటలకి మహిళా సిబ్బంది బతుకమ్మ సంబరాలు అంబారాన్ని అంటేలాగా ఆడినారు. ఈ వేడుకల్లో పవర్ గ్రిడ్ సి యం డి అరుణ్ కుమార్,డి ఆర్ డి ఓ పిడి వి వి అప్పారావు,డి డబ్ల్యూ ఓ నరసింహారావు,డి టి డి ఓ శంకర్,డి ఎస్ సి వెల్ఫేర్ అధికారి లత, బిసి వెల్ఫేర్ అధికారి అనసూర్య, డి సి ఓ పద్మ,పరిపాలనధి కారి సుదర్శన్ రెడ్డి, సూపరిటేడెంట్ పద్మారావు, టియన్‌జిఒ కార్యదర్శి శ్యామ్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అందజేత



**భువనగిరి,అక్టోబర్ 09(మనం న్యూస్) :** పట్టణంలోని అర్బన్ కాలనీ 1వ వార్డ్ లో నిరుపేద కుటుంబానికి చెందిన రెండు కాళ్లు లేని వికలాంగుడు బరిగల శంకర్ తల్లి తో కలిసి గుడి వద్ద బిక్షటన చేస్తూ జీవనం కొన సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం భరిగల శంకర్ చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్, జిల్లా గ్రంధాలయం డైరెక్టర్, పోలిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ పోలిశెట్టి అనిల్ కుమార్ వెళ్లి వారి మృతదేహానికి పూలమాల వేసుకొని నివాళులు అర్పించి చనిపోయిన శంకర్ దహన కార్యక్రమలకు పోలిశెట్టి ఫౌండేషన్ ద్వారా 5000వేల రూపాయలు అతని తల్లి బరిగల జయమ్మకు ఆర్థిక సాయం చేయడం జరిగింది. భవిష్యత్తులో వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం వస్తుపుల అభినేయ, కోట కిట్టు, పత్తి రమేష్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికలకై జోరందుకుంటున్న స్మార్ట్ పోల్స్

**మర్రిగూడ,అక్టోబర్ 09(మనం న్యూస్) :** మర్రిగూడ మండలం వెంకేపల్లి తండ గ్రామ పంచాయతీలో స్వప్రయోజనం, స్వ కుటుంబం అని పక్ష పాతం లేకుండా, అందరికి అందు బాటులో ఉండి, గ్రామ సమస్యలపై పోరాడే వ్యక్తిగా, రేపు రాబోయే స్థానిక ఎన్నికలలో మీ ఓటు ఎవరికి? అని ఆ గ్రామ యువ కులు నిర్వహించిన స్మార్ట్ పోల్స్‌లో నిర్మల రమేష్ అత్య ధిక ఆదరణతో, సర్పంచ్ అభ్యర్థిగా ముందంజలో ఉన్నారు. నిర్మల భర్త అయిన రమేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా గ్రామంలో అందరికి మదిలో, వారి సమస్య లను పరిష్కరించడంలో మంచి సల హాలు సూచనలు ఇచ్చే వ్యక్తిగా మంచి పేరు ఉండటమే దీనికి కారణం. నిజాయితీ కలిగిన ఉపాధ్యాయ కుటుంబం నుంచి సర్పంచ్ అభ్యర్థిగా ఉంటే రేపు గ్రామ సమస్యలను సమర్ధ వంతంగా పరిష్కరించగలుతా రని వెంకేపల్లి గ్రామ ప్రజలు కోరుకుంటున్నట్లు సమాచారం.

## దుర్గా దేవి వద్ద ప్రత్యేక పూజలు

**తిరుమలగిరి, అక్టోబర్ 09 (మనం న్యూస్) :** తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో దేవి మండపం వద్ద నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సరస్వతి దేవి రూపంలో ఉన్న అమ్మవారికి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేకంగా నైవేద్యాలు మంగళహారతులతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చిన్నారులకు పాఠ్యపుస్తకాలు కలములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వై.నరేష్, సుంకరి జనార్ధన్, జుమ్మిలాల్, అంబేద్కర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్,రిమాండ్

- వివరాలను వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర రాజు



**మిర్యాలగూడ, అక్టోబర్ 09 (మనం న్యూస్) :** అనుమానంతో సాగర్ ఎడమ కాల్వలోకి భార్యను నెట్టేసి హత్య చేసిన భర్తను వేములపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ ఆఫీస్ లో డీఎస్పీ రాజశేఖర్ రాజు హత్య కేసు వివరాలను వెల్లడించారు. వేములపల్లి మండలం రావువారిగూడెం గ్రామానికి చెందిన పేరబోయిన సైదులు,మిర్యాలగూడ పట్టణానికి చెందిన కుమ్మరి అనూష (35)ను 16 ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. కాగా గత కొంతకాలంగా దంపతుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. దీంతో భార్యపై వేధింపులకు పాల్పడుతున్నాడు. కాగా అనూష రావువారిగూడెం అంగన్ వాడీ టీచర్ గా బాధ్యతలను చేపడుతూనే... మండలంలోని కామేపల్లి అంగన్ వాడీ సెంటర్ కు ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన సైదులు భార్య అనూషను బైక్ పై తీసుకెళ్లి అంగన్ వాడీ సెంటర్ లో దించారు. తిరిగి అదే రోజు సాయంత్రం 7 గంటలకు బైక్ పై అనూషతో స్వగ్రామం బయలుదేరాడు. ముందస్తు ప్లాన్ ప్రకారం వేములపల్లి మండల పరిధిలోని రావులపెంట దగ్గర నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వద్దకు రాగానే అనూషపై దాడి చేసిండు. ఆమెను బలవంతంగా కాల్వలోకి నెట్టేసిండు. అనుమానం రాకుండా ఉండేల ప్రమాదం జరిగిందని చిత్రీకరించేందుకు బైక్ ను కాల్వలోకి నెట్టడంతో పాటు తాను కాల్వలోకి దిగినట్లు డీఎస్పీ చెప్పారు. బైక్ అదుపు తప్పి ఎడమ కాల్వలో పడి అనూష ప్రమాదవశాత్తు గల్లంతైనట్లు నమ్మించే ప్రయత్నం చేశాడన్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా తానే తన భార్యను హత్య చేయాలన్న ఉద్దేశంతో కాల్వలోకి నెట్టేసినట్లు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. కాగా అనూష మృతదేహం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్ లో లభించినట్లు పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపినట్లు డీఎస్పీ చెప్పారు. కేసులో పురోగతి సాధించిన రూరల్ సీఐ వీరబాబు, వేములపల్లి మాడుగులపల్లి ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, కృష్ణయ్యను డీఎస్పీ అభినందించారు.

# వరి పంటలను పరిశీలించిన సహాయ వ్యవసాయ సంచాలకులు



**అడవిదేవులపల్లి, అక్టోబర్ 9,(మనం న్యూస్) :** అడవిదేవులపల్లి మండలంలోని జీలకరకుంట తండా లో బుధవారం నాడు వరి పంటలను సహాయ వ్యవసాయ సంచాలకులు బి.దేవ్ సింగ్ నాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట లో ఆకుచుట్టు పురుగు ఉధృతి అధికముగా ఉందని దాని నివారణకు ఇండాక్సార్బ్ 200 ఒక ఎకరానికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 200 గ్రా ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలని తెలియజేసారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిలో కాండంతొలుచు పురుగు నివారణకు పిలకలు లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకి 10 కిలోల చొప్పున వేసిన రైతులు, పొట్ట దశలో 0.3 మి. లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ. టెట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు నత్రజని ఎరువులను వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి మరియు పొలం నుండి నీటిని తీసివేయాలని తెలిపారు. ప్లాంటోమైసిన్ 0.2గ్రా. + కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రా. లేదా అగ్రిమైసిన్ 0.4గ్రా. + కాపర్ఆక్సి క్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.వరిలో ఆకుముడత గమనించడమైనది. నివారణకు, 2 గ్రా. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.1మి.లీ. ఫ్లూబెండమైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో అగ్గి తెగులు సోకుటకు అనుకూలం. తెగులు గమనించినచో నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా ఐసోప్రొథైయోలిన్ 1.5 మీ.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మీ.లీ. లేదా ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజేబ్ మిశ్రమ మందు 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు,వరిలో జింక్ దాతువు లోపం గమనించడమైనది. నివారణకు 2గ్రా. జింక్ సల్ఫేట్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.ఆయన వెంట ఏఈఓ లు మహేష్ నాయక్, రావుల నరేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి శ్రీ సరస్వతి మాత అవతారంలో దుర్గాదేవి

- సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు
- 5,000 మందికి మహ అన్నప్రసాద పంపిణీ



**నేరేడుచర్ల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** నేరేడుచర్ల శ్రీ విజయదుర్గ దేవి ఆలయం, శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయాలలో దసరా వేడుకల సందర్భంగా శ్రీ దుర్గా శరన్నవరాత్రీ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం చదువుల తల్లి శ్రీ సరస్వతి మాత అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.వేద పండితులు ములుగు శ్రీనివాసచార్యులు, శివయ్య శాస్త్రి త్రికాల పూజలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం అయినందున విద్యా ప్రాప్తికై జ్ఞాపక శక్తి కై ఉద్యోగ ప్రాప్తికై విద్యార్థిని విద్యార్థులకు శ్రీ సరస్వతి మాతా పూజా ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గామాతను వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుజూర్నగర్ సిఐ చర మంద రాజు, నేరేడుచర్ల ఎస్సై రవీందర్ తమ బృందంతో శ్రీ విజయ దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 5000 మందికి మహా అన్న ప్రసాదం పంపిణీ హుస్సేన్ నగర్ సీఐ చరమంద రాజు, స్థానిక ఎస్సై రవీందర్ మున్సిపల్ చైర్మన్ బచ్చల కూరి ప్రకాష్, కొనతం ఆదిరెడ్డి, అధ్యక్షులు కొనతం చిన్న వెంకటరెడ్డి, కోశాధికారి రాచకొండ రామన్న అన్న ప్రసాదాన్ని పంపిణీ ప్రారంభం చేశారు. రామకోటేశ్వరరావు, నాగ ండ్ల శ్రీధర్, ఆకారపు వెంకటేశ్వర్లు, కొనతం సత్యనారాయణ రెడ్డి, రె డపంగ నాగయ్య, సూరిబాబు, కట్ట గణేష్ రెడ్డి, మెట్టు వేణుగోపాల్ రెడ్డి, పాల్వాయి రమేష్, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, మాశెట్టి మోహన్, వాసు , బలగం రాము, సుబ్రహ్మణ్యం, గరినే సతీష్, కందిబండ రవి, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యరగండ్లపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం



- సొంత నిధులతో 50 సిమెంట్ బెంచీలను ఏర్పాటు
- సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్

**మర్రిగూడ (అక్టోబర్ 09)మనం న్యూస్ :** మండలంలోని యరగండ్లపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సామాజిక కార్యకర్త, యువజన నాయకుడు వల్లంల సంతోష్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలోని 25 ప్రధాన కూడళ్ళు, దేవాలయాల ఆవరణలో 50 సిమెంట్ బెంచీలను ఆయన తన సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సేవా కార్యక్రమాలు, యువతను వివిధ రంగాలలో ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకునీ పని చేస్తున్నానన్నారు. గ్రామస్తుల సూచన మేరకు గ్రామస్తులు కూర్చునేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల నలుగురు ఒకచోట చేరి గ్రామానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ పురోగతికి సంబంధించిన అంశాలను చర్చించుకునేందుకు వీలవుతుందని అన్నారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రామస్తులు, యువత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, మాజీ ప్రజా ప్రతినిధులు, సింగల్ విండో డైరెక్టర్లు ,మాజీ వార్డు సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వీరయ్య, భద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

- అన్నదానాలు ఆధ్యాత్మికతకు ప్రతీకలు



**కోదాడ, అక్టోబర్ 09(మనం న్యూస్) :** అన్నదానాలు ఆధ్యాత్మికతకు ప్రతీకలని కోదాడ పట్టణ సీఐ రాము అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని కోదండ రామ స్వామి ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం ఈరోజు విశేష దినం కావడంతో నాగుబండి వీరయ్య భద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యర్రా వెంకట నారాయణ జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని యర్రా భారతమ్మ వారి కుమారులు కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాగుబండి వీరయ్య భద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ సామాజిక సేవలు అభినందనీయమన్నారు. కాగా ఆలయంలో కుంకుమ పూజలకు భక్తులు పోటెత్తారు. మరో ముఖ్య అతిథి మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ, నేమ్మాది దేవమణి మహిళా కౌంటర్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అన్నదాతలు యర్రా భారతమ్మ,యర్రా శ్రీనివాసరావు,జ్యోతి,యర్రా చంద్రశేఖర్, అనూష,వశిష్ట, గాయత్రి,విదిజ్ఞ చారుహాసిని,దేవాలయ ధర్మకర్తలు నాగుబండి లక్ష్మయ్య,రంగా,పైడిమర్రి వెంకటనారాయణ,పైడిమర్రి నారాయణరావు,పందిరి సత్యనారాయణ,యాద సుధాకర్,పత్తి నరేందర్,కిషోర్,సత్యనారాయణ,గరిణే శ్రీధర్, రవికుమార్, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కొండ విజయ్‌కు ఘన సన్మానం



**కోదాడ,అక్టోబర్ 09(మనం న్యూస్) :** తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ కవుల పాత్ర అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ పట్టా పొందిన కొండ విజయ్ కుమార్ కి బుధవారం కోదాడ పట్టణంలో మైత్రీ కంప్యూటర్ నందు నేస్తం సామాజిక వేదిక, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నేస్తం సామాజిక వేదిక కన్వీనర్ ప్రముఖ న్యాయవాది ఉయ్యాల నర్సయ్య, సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్న గౌడ్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని నారాయణ పురంకు చెందిన కొండ విజయ్ కె.ఆర్.ఆర్. కాలేజీ,ఓయూ లలో ఉన్నత చదువులు కొనసాగించి, మాజీ విద్యార్థి నాయకుడు(ఎస్ఎఫ్ఐ), గా పని చేసి ప్రస్తుతం రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో గ్రూప్–2 ఉద్యోగి(జేఏసీ)గా వున్నారు.ఎంఏ.(ఏకనామిక్స్),ఎంఏ.(తెలుగు), బిఎడ్ చేసి,ప్రొ.తూర్పు మల్లారెడ్డి మార్గదర్శంలో పీహెచ్ డీ చేసి డాక్టరేట్ పట్టా పొందారు అన్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ వెంకటేశ్వర్లు,పుట్టా వెంకటేష్,సోమపంగు గణేష్,మోలుగురి నాగరాజు,గడ్డం లింగయ్య, గుండు విజయ రామారావు,మండవ మదు,చిన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ నియామక పత్రం అందుకున్న కుర్ర శ్రీను



**అడవిదేవులపల్లి, అక్టోబర్ 09(మనం న్యూస్) :** నల్గొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం, బంగారికుంట తండా గ్రామపంచాయతీకి చెందిన రామకోటి– రుక్క దంపతులకు చెందిన కుర్ర శ్రీను నిరుపేద కుటుంబానికి చెందినవారు. గతంలో నాలుగు సార్లు డియస్సీ వ్రాసినారు ఫలితం దక్కలేదు. ఈసారైనా ఉద్యోగం సాధించాలని గట్టి కృషి పట్టుదలతో చదివి జిల్లాలో ఎస్ టీ కేటగిరి లో ఎస్ జీ టీ విభాగంలో 15వ ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించినారు. అందుకు గాను బుధవారం నాడు హైదరాబాద్ లోని ఎల్ బి స్టేడియం నందు రాష్ట్ర ప్రభుత్వము ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందజేసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చేతుల మీదుగా వారు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్నారు.అక్కడ ఏర్పాటు చేసిన జిల్లాల స్టాల్ నందు జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి చేతుల మీదుగా కుర్ర శ్రీను నియామక పత్రాన్ని అందుకున్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పానుగోతు సైదా నాయక్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొర్ర కృష్ణకాంత్ నాయక్, మొల్కచర్ల మాజీ సర్పంచ్ కుర్ర శ్రీను, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు కుర్ర చందు, అజ్మీర శ్రీను మిత్రులు పాల్గొని అభినందించారు.

## జోరుగా బతుకమ్మ పూల విక్రయాలు

**తిరుమలగిరి,అక్టోబర్ 09(మనం న్యూస్) :** తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలు బతుకమ్మ పేర్చడానికి మహిళలు అధిక సంఖ్యలో బంతి, చామంతి, వివిధ రకాల పూలను కొనుగోలు చేశారు. గ్రామాలలో తంగేడు పువ్వు సరిగా దొరక నందున బంతి చామంతి వివిధ రకాల పూలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

# వర్షాభావ పరిస్థితులకు 'చెక్'





- సిరులు కురిపిస్తున్న చెక్ డ్యాం లు
- వెయ్యి ఎకరాలకు పైగా వరి సాగు
- అన్నదాతల కళ్లల్లో ఆనందం

**చర్ల, అక్టోబర్ 9 (మనం న్యూస్) :** వర్షాభావ పరిస్థితుల కారణంగా మెట్ట ప్రాంతంలో సాగు చేసిన వరి చేలు ఎండిపోతుండగా చెక్ డ్యాంల కింద సాగు చేసిన వరి చేలు కళలళలాడుతున్నాయి. వర్షాభావ పరిస్థితులకు 'చెక్' పెడుతూ ఆశించిన స్థాయిలో సాగునీరు నిల్వ ఉండటంతో రైతన్నల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది.చర్ల మండ లంలో సుమారు 18 వేల ఎకరాలలో వరి పంటను అన్నదాతలు సాగుచే స్తున్నారు. 10,500 వేల ఎకరాలు తాలిపేరు ఆయకట్టు కింద, 15 వందల ఎకరాలు లిఫ్ట్ ఇరిగేషన్, మరో 2 వేల ఎకరాలు బోర్ల కింద సాగు చేస్తున్నారు. మిగిలిన 4 వేల ఎకరాలు ఆకాశవాయి కింద సాగవుతుంది. ఈ భూములు ఎక్కువగా సన్న, చిన్నకారు గిరిజనులు సాగుచేస్తున్నారు. ప్రతి ఏటా చివరిలో నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయి అప్పుల పాలయ్యే వారు. ఇటువంటి పరిస్థితులకు 'చెక్' పెడతూ ప్రభుత్వ నీటిపారుదల శాఖ ఆద్వర్యంలో అటవీప్రాంత గ్రామాలలో పలు వాగులు వంకలపై చెక్ డ్యాం లను నిర్మించారు. ఒక్కో చెక్ డ్యాం కింద 40 నుండి 50 ఎకరాల వరకు వరి పంటను సాగు చేస్తున్నారు. ఇలా మండల వ్యాపితంగా 20 కు పైగా చెక్ డ్యాం లు ఉండగా వాడి కింద సుమారు 700 ఎకరాలలో వరి పంటను సాగుచేస్తున్నారు. కొంతకాలం గా వర్షాలు మొహం చాటేయడంతో మెట్టప్రాంత వరి చేలు నెర్రెబారుతున్నాయి. ఆయా చెక్ డ్యాంలు జలకళతో తొనికిసలాడుతుండటంతో వాటి కింద సాగుచేసిన పంటచేలు పచ్చటి తివాచీ పరుచుకున్నాయి. చెక్ డ్యాం లు తక్కువ ఖర్చుతో రైతుకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చడంతో ప్రభుత్వం వీటిని ప్రోత్సహిస్తోంది. గత ఏడాది చర్ల మండలంలో కోటి 20 లక్షల కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహాయ నిదులతో ఉంజుపల్లి, బత్తినపల్లి, ఒద్దిపేట, గన్నవరం కాలని, పులిగుండాల, ఎర్రబోరు గ్రామాలలో వాగులపై చెక్ డ్యామ్‌లను నిర్మించారు. పూర్తి అటవీప్రాంత గ్రామాలు కావడం, అక్కడి భూములకు సాగునీటి అవకాశం లేకపోవడం, ఆకాశవాయిపై ఆదారడటం వంటి కారణాలతో చెక్ డ్యాం ల నిర్మాణం అక్కడి గిరిజన రైతులకు ఉంతో ఉపయోగకారిగా మారాయి. చెక్ డ్యాం లు పూర్తిస్థాయి లో నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. వీటి కింద సాగుచేసే పంటచేలకు సాగునీరుకు ఢోకా లేకపోవడంతో ఆయకట్టు గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వర్షాభావం కారణంగా వరి చేలు ఎండిపోయేవని ఇకపై చెక్ డ్యామ్‌లు తమకు సిరుల పంట కురిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఇంకా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి



**గుండి కోటేశ్వరరావు, గిరిజన రైతు, ఒద్దిపేట**

ఒద్దిపేట గ్రామ సమీపంలోని పూసువాగుపై నిర్మించిన చెక్ డ్యాం క్రింద రెండు ఎకరాల భూమిని కౌలుకి తీసుకుని వరి పంటను సాగుచేసాను. చెక్ డ్యాం నిండా నీరు ఉండటంతో పంట కచ్చితంగా పండుతుందనే నమ్మకం ఉంది. నాకు మరో ప్రాంతంలో ఏడు ఎకరాల పోడు భూమి ఉన్నది. అందులో వరి సాగు చేసాను. ఆ భూమికి సాగునీటి వసతి లేదు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోతోంది. ప్రభుత్వం ఎక్కడికక్కడ విరివిగా చెక్ డ్యాం లను ని ర్మిస్తే ఇటువంటి పరిస్థితులు ఉండవు. సాగునీటి సౌకర్యం లేని ప్రాంతా లలో చెక్ డ్యాం లు నిర్మించి రైతులను ఆదుకోవాలి.

### చెక్కుడ్యామ్‌లతో ఎక్కువ ప్రయోజనం

**తిరుపతి, సాగునీటిపారుదల శాఖ డిఈ**

చెక్ డ్యాం ల నిర్మాణం వల్ల తక్కువ ఖర్చుతో అన్నదాతలకు ఎక్కువ లాభం కలుగుతుంది. గత ఏడాది సాగునీటి ఎద్దడి ఉన్న గిరిజన గ్రామాలను ఎంపిక చేసి చెక్ డ్యాం లు నిర్మించాము. 1 కోటి 20 లక్షల కేంద్రప్రభుత్వ ప్రత్యేక సహాయ నిదుల తో ఆరు ప్రాంతాలలోని వాగులపై వీటి నిర్మాణం చేపట్టాము. ఈ నిర్మా ణాలు సత్ఫలితాలను ఇచ్చింది. అవన్ని జలకళను సంతరించుకున్నాయి. నిండుకుండలా ఉండటంతో ఈ ఏడాది వాటి కింద సాగుచేసిన వరి పం టలకు పుష్కలంగా నీరు అందుతోంది.

## మంత్రుల పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు


- 11న ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో
- సమీకృత గురుకులాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- స్థలాలను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, అక్టోబర్ 9(మనం న్యూస్):** అక్టోబర్ 11న ఖమ్మం జిల్లాలో జరిగే ఉపముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాల సముదాయాలు నిర్మించే స్థలాలను పరిశీలించారు. పాలేరు నియోజకవర్గానికి సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు వద్ద , ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి రఘునాథపాలెం మండలం జింకల తండా వద్ద నూతనంగా నిర్మించనున్న సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయ స్థలాలను కలెక్టర్ పరిశీలించి, మంత్రుల పర్యటనకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ తొలి విడతలో జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు వద్ద , ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలం జింకల తండా వద్ద, మధిర నియోజకవర్గం సంబంధించి బోనకల్ మండలం లక్ష్మీపురంలో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయాలు నిర్మిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 11న ఖమ్మం జిల్లాలో మంజూరైన సమీకృత గురుకులాలకు డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేస్తారని అన్నారు. అక్టోబర్ 11న ఉదయం 9 గంటలకు పాలేరు నియోజకవర్గం, 11 గంటలకు మధిర నియోజకవర్గం, మధ్యాహ్నం 2 గంటలకు ఖమ్మం నియోజకవర్గంలో శంకుస్థాపన చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, సభా స్థలం, సౌండ్ సిస్టం, ప్రజలకు సరిపడా కుర్చీలు, టెంట్, సభా వేదిక, పైలాన్ ఫోటో, వీడియోలతో అవగాహన ప్రదర్శన కోసం ఎల్ఈడీ ప్యానెల్ ఏర్పాటు, తాగునీరు సౌకర్యం, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతుల కల్పన వంటి అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఎస్ఇ ఆర్ అండ్ బి హేమలత, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, అధికారులు, తదితరులు వున్నారు.

## కేజిబివి భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- పాత భవనంలో విద్యార్థినుల అవస్థలు



**ఆళ్లపల్లి, అక్టోబర్ 9(మనం న్యూస్):** రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలను మౌలిక సదుపాయాలతో నూతన భవనాలను నిర్మాణాలు చేపట్టింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆళ్లపల్లి మండల కేంద్రంలో విద్యార్థినులకు కేజీబీవీ నూతన భవనానికి గత రెండు సంవత్సరాల క్రితం నిధులు మంజూరు చేసింది. ఆ భవనానికి నిర్మాణ పనులు చేపట్టి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ నేటి వరకు దానిని వాడకంలోకి తీసుకు రాకపోవడంతో కేజీబీవీలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల పరిధిలోని అనంతోగు గ్రామంలో తాత్కాలికంగా బాలికలు చదువుతున్న కేజీబీవీ పాఠశాలలో సరిపడా గదులు లేకపోవడంతో అదే పాఠశాల ప్రాంగణంలో అంగన్వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ పాఠశాలను నిర్వహిస్తుండటంతో ఉన్న గదులలో వాటికి కొన్ని గదులు కేటాయించిన విషయం తెలిసిందే. కానీ, కేజీబీవీ పాఠశాలలో సుమారు 260 మంది విద్యార్థినులను కేవలం 7 గదులలో కూర్చోబెట్టవలసి వస్తుంది. దీనివల్ల విద్యార్థినులు ఒక్కో తరగతి గదుల్లో ఇరుకుగా కూర్చోని చదవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఉంటున్న కేజీబీవీ పాఠశాల ఆవరణం చుట్టూ ప్రహరీ గోడ కాల పరిమితి పూర్తై గోడలు పగిలి ఉండటంతో విష సర్పాలు, కీటకాలు లోపలికి వచ్చి తిరుగుతున్నాయని విద్యార్థినులు కాలకృత్యాలకు రాత్రి వేళల్లో బయటికి వెళ్లాలంటే ఎటు నుండి ఏ పాము, కీటకాలు వచ్చి కాటేస్తాయోనని భయపడాల్సిన దీన స్థితి నెలకొంది. కేజీబీవీ నూతన భవనం పూర్తయినప్పటికీ చిన్న చిన్న పనులు అసంపూర్తిగా ఉండటంతో నూతన భవనాన్ని ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన భవన నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేసి వాడకంలోకి తీసుకువచ్చి పిల్లల విద్యాభ్యాసంలో ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని సంబంధిత గుత్తేదారు, అధికారులు, స్థానిక వివిధ పార్టీల నాయకులను విద్యార్థినుల తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

## యుటిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి

- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి




**ఖమ్మం, అక్టోబర్ 9(మనం బ్యూరో):** వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం నుండి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో యుటిఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి తిరిగి పోటీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి తెలిపారు. ఖమ్మంలోని యుటిఎఫ్ భవన్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని టిఎస్‌యుటిఎఫ్ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గత ఐదున్నర సంవత్సరాలుగా ఉపాధ్యాయుల, అధ్యాపకుల, విద్యారంగ సమస్యల కోసమే కాకుండా, ప్రజా సమస్యల మీద కూడా అలుపెరుగని పోరాటం చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి లాంటి వారు చట్టసభల్లో ఉండటం చాలా అవసరమని అన్నారు. గడిచిన కాలంలో ఎమ్మెల్సీగా తనకు కేటాయించిన అభివృద్ధి నిధులను పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కేటాయించినట్లు వారు తెలియజేశారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో నల్గొండ నుండి హైదరాబాదు వరకు పాదయాత్ర నిర్వహించి సమస్యల తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కృషి చేశారన్నారు. 2018 పిఆర్సి సందర్భంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 30% వేతనాలు పెంపులో నర్సిరెడ్డి కీలక భూమిక వహించారన్నారు. కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూల్స్, మోడల్ స్కూల్స్ లోని సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయులకు 9 సంవత్సరాలుగా ప్రమోషన్స్, 6 సంవత్సరాలుగా బదిలీలు లేని సందర్భంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రికి, విద్యాశాఖ అధికారులకు పదే పదే ప్రాతినిధ్యాలు చేయడంతో పాటు, ఎస్సీటీఈ అధికారులతో మాట్లాడి 'టెట్' విషయంపై వివరణ ఇప్పించి, ప్రమోషన్లు జరగడంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పాత్ర కీలకమన్నారు. అటువంటి వ్యక్తిని తిరిగి శాసనమండలికి గెలిపించుకోవడానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహకరించాలని కోరారు.

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశా

గత ఐదున్నర సంవత్సరాలుగా విద్యారంగ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలోనూ, బయట పోరాటాల సందర్భంగా శక్తి మేరకు కృషి చేశానని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్స్ లో టైం టేబుల్ మార్పు, కేర్ టేకర్ల నియామకం కోసం, కేజీబీవీ సిబ్బంది రెగ్యులరైజేషన్ కోసం, వారికి కనీస వేతన స్కేల్ కోసం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టుల మంజూరు, డీఈవో, డిప్యూటీ ఇ.ఓ, ఎంఈఓ ప్రమోషన, మిగిలిపోయిన కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులైజేషన్ కోసం కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### పలు సంఘాలు మద్దతు

నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ లోథ్, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివింస్టన్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యల్లయ్య, మైనార్టీ గురుకులాల బాధ్యులు శేషగిరి, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు వినోద్ కుమార్, మల్లయ్య, మోడల్ స్కూల్స్ పాఠశాలల నాయకులు కే.నాగరాజు మద్దతు తెలిపారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చిలుక రాములు, చావ దుర్గాభవాని, జిల్లా నాయకులు జీ.వీ. నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నంది కృష్ణ, బుర్రి వెంకన్న, బెల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, షేక్ ఉద్దండుషరీఫ్, డి.నాగేశ్వరరావు, ఇతర సంఘాల జిల్లా నాయకులు మంగయ్య నాయక్, బాబురావు, పుట్టా శ్రీనివాసరావు, జితేష్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు సయ్యద్ జియావుద్దీన్, బండి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలి



**ఖమ్మం, అక్టోబర్ 9 (మనం న్యూస్):** 20వ డివిజన్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని, పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం 20వ డివిజన్, సాయి నగర్ లో టి.యు.ఎఫ్. ఐ.డి.సి. నిధులు రూ. 50 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపన చేసారు.ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ 20వ డివిజన్‌లో 3 సిసి రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో కూడిన రోడ్లు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, 20వ డివిజన్ కార్పొరేటర్ బి.ప్రశాంత లక్ష్మీ, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి హామీనీ అమలు చేస్తాం

**ఖమ్మం, అక్టోబర్ 9 (మనం న్యూస్):** ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇచ్చిన ప్రతి మాట, హామి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించారు. సత్యనారాయణ పురం టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వ విజయ్ బాబు లతో కలిసి 36 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం క్రింద ఒక్కో జంటకు లక్షా 116 రూపాయల చొప్పున మొత్తం 36 లక్షల 4 వేల 176 రూపాయలను, అలాగే 92 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మొత్తం 32 లక్షల 29 వేల రూపాయల చెక్కులను అందజేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కృషి చేస్తూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని క్రమ పద్ధతిన అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ జి. గణేష్, ఖమ్మం రూరల్ మండల తహశీల్దార్ రాంప్రసాద్,ప్రజాప్రతినిధులు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## 'అంకుర'లో అధునాతన వైద్య సౌకర్యాలు

- ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రజల ముందుకు



**ఖమ్మం, అక్టోబర్ 9(మనం న్యూస్):** అత్యుత్తమ, ఆధునాతన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు అందించేందుకు నూతన హంగులతో రూపు దిద్దుకున్న అంకుర ఆసుపత్రి ప్రజల ముందుకు వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలోని గొరిల్లా పార్క్, సీక్వెల్ రిసార్ట్స్ సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన అంకుర హాస్పటల్ ను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలు, పిల్లలకు సంబంధించిన అంశాల్లో అంకుర ఆసుపత్రి ప్రత్యేకమైన వైద్య చరిత్ర కలిగి ఉందని తెలిపారు. అంకురా హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ దేశవ్యాప్తంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర ఒడిస్సా రాష్ట్రాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో 14 కేంద్రాల్లో వైద్యసేవలు అందించడం గొప్ప శుభ పరిణామమని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.వైద్య సేవలలో ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, హైదరాబాద్ తర్వాత అంతటి కీర్తిని ఖమ్మం పొందిందని, వైద్య రంగంలో ఖమ్మం హెల్త్ హబ్ గా తలపిస్తుందన్నారు. వైద్య రంగంలో అంకుర హాస్పిటల్ చేస్తున్న సేవలు మరుపు రానివని, దశాబ్దాల కాలంగా హాస్పటల్ యాజమాన్యం వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక సేవ ను తలపించే విధంగా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం హర్ష దాయకం అన్నారు. ఈ సందర్భంగా అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అన్నీ బ్రాంచిల్లో మొత్తం 1800 పడకలు ఉన్నాయని, అందులో భాగంగా ఎన్నో సంవత్సరాలుగా ఖమ్మంలో విశిష్ట సేవలు అందిస్తున్న అంకుర ఆసుపత్రి రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్న ఉద్దేశంతో నూతన భవనంలో 120 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. సరికొత్త అత్యాధునిక సాంకేతికతతో అన్నీ వయస్సుల మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణను అందించడానికి అంకుర బృందం నిరంతరం శ్రమిస్తుందన్నారు. డిజిటల్ పద్ధతిలో అంకుర సేవలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఖమ్మంలో 24 పడకల ఎన్ఐసీయు (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్), 18 పడకల పీఐసీయు (పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఉన్నాట్లు తెలిపారు. వాటిద్వారా అకాల, నవజాత శిశువులకు అవసరమయ్యే అత్యంత క్లిష్టమైన సంరక్షణను అందించనున్నట్టు తెలిపారు. తమ ఆసుపత్రిలో నిపుణులైన శిశువైద్యులు, ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్టు, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది క్లిష్టమైన సంరక్షణ సేవలు అందించేందుకు. 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఖమ్మం కేంద్రంలో 3ఎం ఫెర్టిలిటీ సౌకర్యం ఉందన్నారు. సంతానోత్పత్తి విషయంలో ప్రపంచ సగటులను అధిగమించి అధిక విజయాల రేటును అంకుర కలిగి ఉందన్నారు. ఖమ్మంలో ఈ సదుపాయం ఉండటం అనేది ఇన్ఫెర్టిలిటీ నివారణలు కోరుకునే దంపతులకు ఒక వరంలా మారనుందన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా చైల్డ్- ఫ్రెండ్లీ, మహిళలు, గర్భిణీ స్త్రీలకు ప్రశాంతమైన వాతావరణంలో వైద్య సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. గర్భిణీ స్త్రీలు విలాసవంతమైన సౌకర్యవంతమైన సూట్లు, ఆధునాతన పిండం ఔషధ సంరక్షణ , అధిక-నాణ్యత గల ప్రినేటల్ , పెరినాటల్ కేర్ సౌకర్యాలు అందించనున్నట్లు తెలిపారు. చైల్ బర్తింగ్ క్లాసెస్, గర్భిణీ స్త్రీలకు యోగా, ఆహారం, బ్రెస్ట్ ఫీడింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు తమ ఆసుపత్రిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంకుర అసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాకేష్ చల్లగుళ్ల, మాజీ ఎమ్మెల్సీ బాలస్వామి లక్ష్మీనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు, గిడ్డంగుల సంస్థల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరరావు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వి.సుబ్బారావు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ , క్లస్టర్ మెడికల్ హెడ్ డాక్టర్ దుర్గాప్రసాద్, మెడికల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

# డీఎస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ చేయాలి: సుధాకర్ మాదిగ

**రంగారెడ్డి,అక్టోబర్ 9(మనం న్యూస్) :** ఎల్బీనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల దగ్గర బత్తిన సుధాకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్చార్జ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ మహనీయుల విగ్రహాల దగ్గర నుండి సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. అనంతరం సరూర్ నగర్ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ... డీఎస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ చేయకుండా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 11065 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం అంటే మాదిగలకు అన్యాయం చేయడమే అని, ఆగస్టులో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ అన్ని రాష్ట్రాల కన్నా ముందు నేనే చేస్తానని హామీ ఇచ్చినారని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి మాలల ప్రలోభాలకు లొంగి మాదిగలకు అన్యాయం చేస్తున్నారు అని రాబోయే రోజుల్లో మాదిగలు, ఉప కులాలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదు అని హెచ్చరించారు. ఈ




కార్యక్రమంలో డి.ప్రకాష్ మాదిగ నియోజకవర్గ కార్యదర్శి, కొమ్ము రాజశేఖర్ కొత్తపేట డివిజన్ ఇంచార్జి, రాజు మాదిగ చంపపేట్ డివిజన్ ఇంచార్జి, బుచ్చన్న మాదిగ హయత్ నగర్ డివిజన్ ఇంచార్జి, లింగం మాదిగ బి.ఎన్.రెడ్డి డివిజన్ ఇంచార్జి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మొండి కత్తి




పరశురాం మాదిగ, ఇరుగు రవి మాదిగ, సాయి మాదిగ, కృపాకర్ మాదిగ, పుల్లయ్య మాదిగ, మధు సురేష్ మాదిగ, నరసింహ సాయి మాదిగ, రవి మాదిగ, లోకేష్ మాదిగ, రంగయ్య మాదిగ, అడివి మాదిగ, ప్రకాష్ మాదిగ, సుమన్ మాదిగ, శీను మాదిగ, యాదయ్య బైండ్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసు, ఎక్సైజ్ అధికారుల దాడులు



**కాటారం,అక్టోబర్ 09(మనం న్యూస్) :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో జిల్లాలో గుడుంబా స్థావరాలపై పోలీసు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఏకకాలంలో బుధవారం దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 2320 లీటర్ల బెల్లం పానకం ధ్వంసంతో పాటు,124 లీటర్ల గుడుంబా పట్టుబడింది. గుడుంబా తయారికి ఉపయోగించే వివిధ పాత్రలను స్వాధీనం చేసుకొని, 13 కేసులు నమోదు చేసి 18 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి వేముల శ్రీనివాస్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఎక్సైజ్ ,పోలీసు శాఖ అధికారులు మాట్లాడుతూఅక్రమంగా గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా వల్ల అనేక నష్టాలున్నాయని, గుడుబా వల్ల అనారోగ్యం సంభవించడంతో పాటు, ప్రాణాలు పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు గుడుంబా స్థావరాల వివరాలు, తయారీదారుల సమాచారం పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు తెలియచేయాలని అన్నారు. ప్రభుత్వ గుడుంబా విషయంలో చాల సిరియస్ గా ఉందని, గుడుంబా నిర్మూలనకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల, భూపాలపల్లి, కాటారం సిఐలు మల్లేష్, నరేష్ కుమార్, ఎక్సైజ్ అధికారులు, రమ్యా రెడ్డి, రాజ సమ్మయ్య కిష్టయ్య, షేక్ రబ్బానీ, పోలీసు,ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన చిట్యాల గౌడ సంఘం అధ్యక్షుడు

**చిట్యాల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** చిట్యాల మండలం గౌడ సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన బుర్ర లక్ష్మణ్ గౌడ్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుని బుధవారం మర్యాదపూర్వకంగా కలసి బోకే ఇచ్చి శాలువాతో సన్మానించాడు.అనంతరం ఎమ్మెల్యే చిట్యాల గౌడ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ కు అభినందనలు తెలియజేస్తూ సంఘాన్ని బలోపేతంలో నడిపించాలని నా సహాయ సహకారాలు మీకు ఉంటాయని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చిట్యాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ,టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుకోటగిరి సతీష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, యూత్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ ,బీసీసెల్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గద్దం కొమురయ్య, టౌన్ యూత్ అధ్యక్షుడు అల్లం రాజు ,మాజీ ఎంపీటీసీ సర్వ శరత్ ,గౌడ



సంఘండైరెక్టర్ బుర్ర రాజకుమార్ పాల్గొన్నారు.

# సమాజ సేవ తన బాధ్యత



**చేవెళ్ల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** సమాజసేవ తన బాధ్యతని ఎవరో వస్తారని ఏదో చేస్తారని కాకుండా తన వంతు బాధ్యతగా ప్రజా శ్రేయస్సుకొరకై కృషి చేస్తున్నట్లు బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కృష్ణమోహన్ ముదిరాజ్ పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని పామేనా గ్రామంలో గత కొన్ని నెలలుగా ప్రజలు విష జ్వరాలతో అనారోగ్యం పాడిన పడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు గురవుతున్నారని దోమల బెడద తీరాలని మందు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మనం రిపోర్టర్ తో మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పరిపాలన లో చెత్త వ్యర్థ పదార్థాలవల్లన కురుస్తున్న వర్షాలకు గుంతలలో నిలిచి ఉన్న నీరు దోమల బెడద ఎక్కువ అవడంతో ప్రజలు తీవ్ర అస్వస్థకు గురవుతున్నారనిపేర్కొన్నారు. ఇటీవల డెంగ్యూ వ్యాధితో బాలుడు మృతి చెందిన సంగతి తెలిసిందే.అయినా అధికారులు చుట్టం చూపుగా వచ్చి వెళ్లారని చర్యలేమి తీసుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో గుండెల్లో సామాజిక సేవ మెండుగా ఉన్న కృష్ణమోహన్ ముందుకొచ్చి దోమల మందు పిచికారి చేస్తున్నారు. దోమల బెడదా తగ్గేవరకు కృషి చేస్తానని గ్రామ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృష్ణ మోహన్ పై గ్రామస్తుల అభినందన వెల్లువిరుస్తున్నాయి.

# కెహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 9 (మనం న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలోని పల్లెపహాడ్ గ్రామంలో కోల ఉప్పలయ్య అనారోగ్యం కారణంగా మరణించడం జరిగినది. వారికి రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కే హెచ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5000 వేల రూపాయలను గ్రామశాఖ అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ కాలే మల్లేష్ ఆధ్వర్యంలో మృత్యుని కుటుంబానికి అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ సుంకరి పరశురాములు, మాజీ గ్రామశాఖ అధ్యక్షులు మిర్యాల బీరయ్య, సెక్రటరీ జనరల్ కొత్తపల్లి పెంటయ్య, కుసుమని సత్యనారాయణ, మొగలాగని ఆంజయ్య, ఆలంశెట్టి సురేష్, కొమిరిశెట్టి ఐలయ్య, మాజీ వార్డ్ మెంబర్ గజ్జెల్లి పరశురాములు, మచ్చ నగేష్, లక్కర్స్ రమేష్, అల్లం చెట్టి రామచంద్రు, గజ్జెల్లి జానీ, కాల



మల్లేష్, సుంకరి రాములు, అల్లం చెట్టి సందీప్, పంజాల రవి, జట్ట నరసయ్య, కొత్తపెల్లి మల్లయ్య, బోడపాట్ల మోహన్ రెడ్డి, రాజయ్య, గజ్జెల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ అనుమంతుల లింగయ్య సంతాప సభ



**ఆత్మకూర్(ఎం), అక్టోబర్ 9 (మనం న్యూస్) :** ఆత్మకూరు మండలం కూరెళ్ళ గ్రామంలో కామ్రేడ్ అనుమంతల లింగయ్య సంతాప సభకు ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు కామ్రేడ్ రచ్చ గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి పార్టీలో నిర్మాణ పద్ధతిలో ఉంటూ ప్రజా సమస్యల మీద నిరంతరం ప్రజా పక్షాన పోరాడిన పార్టీ నాయకుడిని కోల్పోవడం తీరని నష్టం అని, ఆయన ఆశయ స్ఫూర్తితో ప్రజా పక్షాన పోరాడుతామని తెలిపారు. ఆయన మర ణం ఈ పార్టీకి తీరని లోటుగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షం, సిపిఎం నాయకులు భాష బోయిన రాములు, మర్రిపల్లి మల్లయ్య , గ్రామ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, కూరెళ్ల నాగయ్య, బండ సోమయ్య, అవనగంటి సోమయ్య, మారుపాక యాదయ్య, అవనగంటి చంద్రయ్య, వనం అంజయ్య, నిమ్మనగోటి మల్లయ్య, జక్కుల చంద్రయ్య, పొన్నం రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉడుతల పెద్దులు మృతి బాధాకరం

- మర్రిగూడ మాజి జెడ్పీటిసి పాశం సురేందర్ రెడ్డి

**మర్రిగూడ,అక్టోబర్ 09(మనం న్యూస్) :** మర్రిగూడ మండలం కొండూరు గ్రామానికి చెందిన ఉడుతల పెద్దులు మృతి చెందడం బాధాకరమని మాజీ నల్గొండ జిల్లా ఫైనాన్స్ కమిటీ మెంబర్ జెడ్ పి టి సి పాశం సురేందర్ రెడ్డి అన్నారు.బుధవారం కొండూరు గ్రామంలోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పాల్వాయి అనిల్ రెడ్డి, విజయరామారావు, దామెర భీమనపల్లి మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు, లెంకలపల్లి మాజీ సర్పంచ్ పాక నగేష్, యరగండ్ల పల్లి మాజీ సర్పంచ్ మాడెం శాంతమ్మ వెంకటయ్య, కొండూరు మాజీ సర్పంచ్ కుంభం నర్సమ్మ మాధవరెడ్డి, రాజాపేట తండా మాజీ సర్పంచ్ నున్సవాత్ సక్కుబాయి బిచ్చునాయక్,ఎడ్ల మల్లేష్, బేత వెంకటేష్, ఆంజనేయులు, పందుల పాండు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శులకు ఫీల్డ్ సర్వేపై శిక్షణ



**కాటారం,అక్టోబర్ 09(మనం న్యూస్) :** కాటారం మండల పంచాయతీ అధికారి పి. వీరస్వామి బుధవారం ల్యాండ్ రెగ్యులేషన్ సర్వే ( ఎల్ ఆర్ ఎస్) పై సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ లో సర్వే పై ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంజనీర్ రాజేష్ , పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ సిబ్బంది, జిపి స్టాప్ హాజరైనారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ



**చిట్యాల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** మండల కేంద్రములో అనారోగ్యంతో మృతి చెందిన బుర్ర మహేష్ కుటుంబ సభ్యులను బిఅరెస్ నాయకుడు రవీందర్పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపాడు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి గొర్ర సాగర్ ,నాయకులు పిట్ట సురేష్ ,కట్కూరి రాజేందర్ ,ములుగురి రాకేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేపాక ప్రదీప్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వలిగొండ, అక్టోబర్ 9(మనం న్యూస్) :** వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామానికి చెందిన ఇందూరు విద్యాసంస్థల చైర్మన్ రేపాక ప్రదీప్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆ గ్రామ మాజీ సర్పంచ్ మాదా లావణ్య శంకర్ గౌడ్, గౌరెల కాపర్ల సంఘం జిల్లా డైరెక్టర్ దేశబోయిన సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేద ప్రజల కోసం నిరంతరం ప్రజల్లో ఉండి సేవలందించే ప్రదీప్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భగత్, సూర్యం, సతీష్, చాగంటి రాజేష్, నాగరాజు గౌడ్, స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్, సతీష్ గౌడ్, శ్రీహరి గౌడ్, కుమార్, ధోని, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపుల కంపచెట్ల తొలగింపు

**మర్రిగూడ,అక్టోబర్ 09(మనం న్యూస్) :** ముంపు గ్రామాలైన చర్లగూడెం, వెంకేపల్లి, మీదుగా కుదాబక్షుపల్లి గ్రామం వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు మూసుకోని వున్నవి. రోడ్డుపై ప్రయాణము ప్రజలకు ప్రమాదకరంగా ఉన్నది. ఈ విషయం నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్ రావు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన సూచన మేరకు రవీందర్ రావు జెసిబి తో చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామ ప్రజల కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, రవీందర్ రావుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## చిట్యాలలో ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్



**చిట్యాల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** రాష్ట్రీయ స్వయం సేవక సంఘం చిట్యాల మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రూట్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు గనవేషాధారణలో 120 మంది స్వయం సేవకులు పాల్గొని రూట్ మార్చ్ నిర్వహించారు హిందువులను ఐక్యమత్యం చేయడం ప్రధాన లక్ష్యమన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంఘ్ చాలాక్ సంజీవ చిట్యాల బిజెపి మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ జిల్లా కార్యవర్గ బుర్రసదయ , కండ సంఘచాల కనుకుల లక్ష్మిరెడ్డి , వరంగల్ విభాగ్ సేవ ప్రముఖ కనుకుల చంద్రారెడ్డి , కండ సహకార్యవాహ శ్రీరాం రఘుపతి, గద్దం వెంకటేష్, ముప్పుడోజు సాయికిరణ్, అల్లం మధుకర్, పుప్పాల సురేష్, కుడి కాల శ్రీనివాస్, చిలుముల శ్రీనివాస్, చింతల సాయి వినయ్, ఆరెపల్లి శ్రీనివాస్, కనకం భద్రయ్య, బుర్ర వెంకన్న, గుండా మణికుమార్, వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## శాసన మండలి నూతన చీఫ్ విప్‌ను కలిసిన చేవెళ్ల కాంగ్రెస్ నేతలు



**చేవెళ్ల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్గా నూతన బాధ్యతలు స్వీకరించిన పట్నం మహేందర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి శాసన మండలం తన చాంబర్లో పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన బాధ్యతలు స్వీకరించిన మహేందర్ రెడ్డి భవిషత్తు రాజకయాలలో ఉన్నత శిఖరాలు అధిరోదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి,చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, చేవెళ్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా మాత దగ్గర అన్న ప్రసాదం వితరణ



**కాళేశ్వరం,అక్టోబర్ 09(మనం న్యూస్) :** మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో అమ్మ భవాని కమిటీ ఏర్పటు చేసిన దుర్గ భవాని అమ్మవారి వద్ద ఏడవ రోజు బుధవారం మహదేవపూర్ వాస్తవ్యులు విశ్రాంత ఉద్యోగులు గుజ్జేటి రాజవీరు, లక్ష్మి దంపతులు, సీనియార్ పాత్రికేయుడు శ్రీనివాస్ గుజ్జెటి అఆద్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేసారు. ఈ సందర్భంగా సూమరు 300 మంది భక్తులకు అన్నా ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మమత, కమిటీ సభ్యులు నాగరాజు, సంతోష్, శ్రీకాంత్, హన్మంత్,సాయి, రాకేష్, శేఖర్ భక్తులు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



**చిట్యాల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** కుటుంబ కలహాల తో ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూకల్ గ్రామానికి చెందిన మహ్మద్ వసీం కుటుంబ కలహాల తో ఇంట్లోనే బెడ్ రూమ్ లో ఫ్యాన్ కి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మహమ్మద్ రహీద్ సమాచారం తో ఎస్సై షా ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, మృతునికి ఏడాది క్రితం పెళ్లి కాగా రెండు నెలల బాబు వున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

**చేవెళ్ల, అక్టోబర్ 09(మనం న్యూస్) :** చేవెళ్ల మండలం రామన్న గూడ గ్రామం లో పారిశుద్ధ్య కార్మికులకు యున నాయకుడు పెద్దోళ్ళ దయాకర్ దసరా పర్వాదినాన్ని పురిష్కరించుకొని బుధవారం నాడు పారిశుద్ధ్య కార్మికుల కు దుస్తులు పంపిణి చేశారు.ఈ కార్యక్రమం లో నరేందర్ రెడ్డి, అంజయ్య, పోతిరెడ్డి, నాగయ్య,జంగయ్య, బాబు, పెద్దోళ్ళ శ్రీధర్, గోపాల్, సంపత్, మహేందర్, దినేష్, మల్లేష్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ వద్ద చెత్త డిస్పోజల్‌కు ప్రణాళికలు రూపొందించాలి

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- డంపింగ్ యార్డు అప్రోచ్, ఇంటర్నల్ సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన



**ఖమ్మం, అక్టోబర్ 9(మనం న్యూస్):** డంపింగ్ యార్డ్ వద్ద చెత్త డిస్పోజల్ కు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో పర్యటించి ఒకటవ డివిజన్ టి.ఎన్.జి.ఓస్. కాలనీలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు ఒక కోటి 15 లక్షల రూపాయలతో చేపట్టిన డంపింగ్ యార్డు అప్రోచ్, ఇంటర్నల్ సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వ విజయ్ బాబు లతో కలిసి శంకుస్థాపన చేశారు. డంపింగ్ యార్డ్ నిర్వహణ ప్రణాళికలు, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ప్రణాళికలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు సంబంధిత అంశాల వివరాలను మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ వద్ద ఒకే చోట పెద్ద ఎత్తున చెత్త డంప్ చేయడం వల్ల ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని, చెత్తను ఎప్పటికప్పుడు డిస్పోజ్ చేయాలని అన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరువేరు సేకరణపై మున్సిపల్ సిబ్బందికి శిక్షణ అందించాలని, ప్రజలలో కూడా అవగాహన కల్పించాలని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లకు కూడా రోడ్డు సౌకర్యం ఉండేలా ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఒకటవ డివిజన్ లో డంపింగ్ యార్డ్ అప్రోచ్ రోడ్, అంతర్గత రోడ్లకు ప్రభుత్వం కోటి 15 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో కూడిన రోడ్లు, అగ్రిమెంట్ సమయంలోగా వేయాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ డివిజన్ కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్, ఖమ్మం ఆర్డీఓ గణేష్, ఖమ్మం అర్బన్ తహశీల్దార్ సిహెచ్. స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మేకపోతులు మృతి



**నేరేడుచర్ల,అక్టోబర్ 09(మనం న్యూస్) :** నేరేడుచర్ల మండలం మూసిఓడ్డు తండాలో బుధవారం పిడుగు పడటంతో 12 శాల్తీల మేకలు మేకపోతులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బానోతు బాలు అడవికి వెళ్లి మేపుతున్న సమయాన ఒకేసారి పిడుగు పడటంతో రెండు లక్షల విలువగల మేకలు మేకపోతులు మృతి చెందాయని విలపించాడు. విషయం తెలుసుకున్న ఆర్ ఐ నరసయ్య భానోతు బాలు దగ్గరకి వెళ్లి మృతి చెందిన మూగజీవాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు.

## పిఆర్టియు టీజిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా రెండవసారి ప్రభాకర్ రావు ఎన్నిక



**కోదాడ,అక్టోబర్ 09(మనం న్యూస్) :** హైదరాబాదులో జరిగిన ప్రోగ్రెసివ్ రికగ్నైజ్ డు టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పిఆర్టియు టీజీఎస్) 35వ రాష్ట్ర కౌన్సిల్ సమా వేశంలో కోదాడ పట్టణానికి చెందిన మాతంగి ప్రభాకర్ రావు ప్రభుత్వ ఉన్నత పాఠ శాల హుజూర్ నగర్ స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నరు. పిఆర్టియు టిజిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా2024-2026 విద్య సంవత్సరానికి హైదరాబాదులో ప్రమాణ స్వీకారం చేసినా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరిం చిన పిఆర్టియు టిజిఎస్ సంఘం మండల జిల్లా రాష్ట్ర సీనియర్, మాజీ నాయకులకు కృతజ్ఞ తలు తెలిపారు.సంఘ బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన బాధ్య తగా కృషి చేస్తానని అన్నారు.

## ఎల్‌ఆర్ఎస్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్



**తిరుమలగిరి, అక్టోబర్09(మనం న్యూస్):** తిరుమలగిరి మున్సిపాలిటిలో ఎల్ఆర్ఎస్ చెల్లించిన ప్లాట్లను జిల్లా అదనపు కలెక్టర్ బి.లత బుధవారం పరిశీలించారు. ఆవెంట తహసిల్దార్ హరిప్రసాద్, మున్సిపాలిటి కమిషనర్ బుచ్చిబాబు,ఆర్ఐ సూర్జిత్‌రెడ్డి, మగ్దూం బాబా, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలివెళ్లిన డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయులు




**తిరుమలగిరి, అక్టోబర్09(మనం న్యూస్):** డీఎస్సీ2024 రిక్రూట్మెంట్‌లో ఎంపికైన తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకోవడానికి బుధవారం తిరుమలగిరి మండల కేంద్రం నుండి బస్సులో ఉపాధ్యాయులు బయలుదేరి వెళ్లారు. మండల నాయబ్ తహసిల్దార్ జాన్‌మహ్మద్, ఎంఈవోలు శాంతయ్య, ప్రభాకర్ , అభ్యర్దులు తదితరులు వెళ్లారు.

## సీఎం రేవంత్‌తో ఆదివాసీ సంఘాల భేటీ

**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసి సంఘాలు భేటీ అయ్యాయి. జూబ్లీహిల్స్ లోని సీఎం అధికారిక నివాసంలో బుదవారం భేటీ అయిన పలు సంఘాల ప్రతినిధులు..తమ ప్రాంత సమస్యలను సీఎంకి వివరించారు. జైనూరు ఘటన దరిమిలా ఆదివాసులు, మైనారిటీ వర్గాల మధ్య సఖ్యత కుదుర్చేందుకు ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇరు వర్గాలతో ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చొరవ తీసుకొని ఆదివాసి సంఘాలను తొడ్కొని సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తమ సమస్యలను ఆదిలాబాద్ ఆదివాసి సంఘాల ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతి పత్రాలు అంద చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తమ భూములు, ఉద్యోగాలు తమకే దక్కేలా చూడాలని కోరారు. ఆదివాసీల సమస్యలు సావధానంగా విన్న రేవంత్ రెడ్డి.. దీపావళి లోపు సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశానికి ఆదివాసి సంఘాల ను, ముఖ్యలను ఆహ్వానిస్తామని, ఆ సమావేశంలోనే ఆదివాసీల డి మాండ్ల సాధ్యసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటా మని ఆదివాసి సంఘాలకు హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ కలెక్టర్ గా పనిచేసి అక్కడి సమస్య పట్ల పూర్తి అవగాహన ఉన్న దివ్య దేవరాజ న్‌ను అక్కడికి పంపించి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటా మన్నారు. ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించెందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నందున ప్రభుత్వానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసి సంఘాల ప్రతినిధులకు సూచించారు. తమ సమస్యలు పరిష్కరిస్తామ ని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి, సమస్యను పరిష్కరించే దిశలో చూపి సీఎంతో సమావేశం ఏర్పాటు చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణకు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖా తుమ్మల నాగేశ్వర రావు
- ₹రఘునాథపాలెం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రఘునాథపాలెం, అక్టోబర్ 9(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులందరికి అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం మంత్రి, రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రఘునాథపాలెం మండలంలో మంత్రి పర్యటించి ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులు రూ. 14 లక్షలతో మంగ్యాతండాలో చేపట్టిన (3 ) అంతర్గత సి.సి. రోడ్డు, డ్రైయిన్ల నిర్మాణ పనులకు, రూ. 14 లక్షలతో కె.వి. బంజరలో చేపట్టిన (2 ) అంతర్గత సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు, రూ. 29 లక్షలతో మూల గూడెంలో చేపట్టిన (4) అంతర్గత సి.సి. రోడ్డు, డ్రైయిన్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రఘునాథపాలెం మండలం వ్యాప్తంగా ఇల్లు లేని, గుడిసెలు, రేకుల షెడ్డులలో ఉంటున్న పేదల జాబితాను తీసుకోవాలని, ముందస్తుగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసుకోవడం జరుగుతుందని, దశల వారీగా ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు అందేలా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రఘునాథపాలెం మండలంలో 72 అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలు ఉండాలని, పెండింగ్ లేకుండా అంగన్వాడి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, కొత్త భవనాలు లేని కేంద్రాలకు ప్రతిపాదన సమర్పించాలని, పాఠశాలల అభివృద్ధికి అవసరమైన పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. 2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులకు షెడ్యూల్ ప్రకటించి రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి అన్నారు. అరులైన ప్రతి రైతుకు రుణమాఫీ పథకం అందుతుందని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామాలలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని, నీళ్లు రోడ్డుపై నిలవకుండా డ్రైయిన్లు కూడా నిర్మిస్తున్నామని, వర్షపు నీరు నేరుగా డ్రైయిన్లకు వచ్చే విధంగా రోడ్ల నిర్మాణం పక్కాగా జరగాలని మంత్రి అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ పక్కదారిపై విచారణ పూర్తి

- దోషులపై చర్యలు.. రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు..
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ



**ఖమ్మం, అక్టోబర్ 9(మనం బ్యూరో):** జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్కదారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రబీ, ఖరీఫ్ కు సంబంధించి రైతుల నుండి ధాన్య సేకరణ చేసిన పిదప ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, కస్టమ్ మిల్లింగ్ రైస్ ను తిరిగి ఇచ్చుటకు గాను జిల్లాలోని రైస్ మిల్లులకు వాటి వాటి సామర్థ్యం మేరకు ధాన్యం కేటాయింపులు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇట్టి ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, తిరిగి ప్రజావసరాల నిమిత్తం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందని అదనపు కలెక్టర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో ఏ మిల్లర్ వద్ద ఎంత ధాన్యం ఉంది, కస్టమ్ మిల్లింగ్ రైస్ కి ఎంత ధాన్యం ఇచ్చారు, ఇంకా ఎంత రావాల్సి ఉంది వివరాలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖ అధికారులపై వుందన్నారు. గత నెల 24న చేపట్టిన తనిఖీల్లో కొన్ని మిల్లుల్లో కేటాయించిన ధాన్యం నిల్వలు లేనట్లుగా గుర్తించి, ఇట్టి విషయమై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. మిల్లులకు సంబంధించి సిఎంఆర్ రైస్ అందజేత, ధాన్యం నిల్వలపై పౌరసరఫరాల సంస్థ విచారణ జరపగా, అధికారుల బాధ్యతలు, విధుల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టడం జరిగిందన్నారు. విచారణ పూర్తిచేసి విచారణ నివేదిక జిల్లా కలెక్టర్ కు సమర్పించామని, చట్ట ప్రకారం బాధ్యులపై త్వరలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిఎంఆర్ ప్రక్కదారి పట్టించిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం, విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపర చర్యలు చేపట్టనున్నట్లు అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

**జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 9(మనం న్యూస్):** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. జాజిరెడ్డిగూడెంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉమ్మడి మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించగా గురువారం ముగిశాయి. మొదటి బహుమతి జాజిరెడ్డిగూడెం, రెండొవ బహుమతి లోయపల్లి, మూడవ బహుమతి జాజిరెడ్డిగూడెం(బి) జట్లు గెలుపొందాయి. గెలుపొందిన టీంలకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం పీడీలను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థుల బింగి కృష్ణమూర్తి, ఎల్లెంల కోమిరెల్లి, సూతరపు అనిల్, గొల్లబోయిన అక్కులు, నర్సింగ శ్రీనివాస్, కుంభం సత్తయ్య, శ్రీశైలం, వీరయ్య, సత్యనారాయణ, నాగరాజు, సోమయ్య, సోమలింగం, బన్ని, రాజకుమార్, గణేష్, నరేష్, నవీన్, లోకేష్, సాయి, వినయ్, మల్లేష్, సైదులు, సోమయ్య, పీఈటీ, గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.



# ఇక నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 :** పేదల కోసం కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనతో పాటు ఇతర సంక్షేమ పథకాల కింద ఇక నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. గరీబ్ కల్యాణ్ యోజన పథకాన్ని 2028 డిసెంబర్ వరకు పొడిగించారు. అంటే అప్పటి వరకూ పేదలకు ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తారు. కేంద్రం వందశాతం నిధులతో పోషకాహారం అందించేందుకు వీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర దేశ ప్రజలందరికీ పౌష్టికాహార హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఆహార భద్రతలో భాగంగా ఉచితంగా బియ్యం/ఆహారధాన్యాలు అందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనతోపాటు సంబంధిత పథకాలను కేంద్రం పొడిగించింది. 2028 డిసెంబరు వరకు ఉచిత బియ్యం పంపిణీ పథకాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి కోసం రూ. 17,082 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. లోథాల్‌లో 'నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్' అభివృద్ధికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజస్థాన్, పంజాబ్ సరిహద్దుల్లో రూ.4,406 కోట్లతో 2280 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి అంగీకరించింది. దేశంలో రక్తహీనత, సూక్ష్మపోషకాల లోపాలను అరికట్టేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రధానమంత్రి పోషణ్ అనే పథకం అమల్లో ఉంది. సాధారణ బియ్యంలో పోషకాలను జోడిస్తే ఫోర్టిఫైడ్ రైస్ అవుతుంది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫోర్టిఫైడ్ రైస్‌గా చెప్పుకోవచ్చు. ఆహారాన్ని బలవర్థకం చేయడమే లక్ష్యం. బియ్యం, ఇతర ఆహార ధాన్యాలలో ఫోర్టిఫైడ్ రైస్ కెన్నెల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారిస్తామని కేంద్రం ఇప్పటికే తెలిపింది. కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. బియ్యాన్ని పిండిగా మార్చి దానికి ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి విటమిన్లు, పోషకాలను కలిపి అనంతరం ఆ పిండిని కెన్నెల్స్‌గా మార్చేస్తారు. ఇలా తయారు చేసే పరిశ్రమలు దేశవ్యాప్తంగా పరిమితంగా ఉ?నాయి. ఆయా పరిశ్రమల నుంచి మిల్లర్లకు కేంద్రం ఈ ఫోర్టిఫైడ్ రైస్ కెన్నెల్స్ సరఫరా చేస్తుంది. ప్రతి క్వింటాలు బియ్యానికి 1 కిలో ఫార్టిడ్ రైస్ కెన్నెల్స్ కలిసేలా ఇప్పటికే ప్రత్యేక యంత్రాలు కూడా ఉన్నాయి. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజాపంపిణీ బియ్యం.. ఇలా దశలవారీగా అన్ని సంక్షేమ పథకాల ద్వారా బలవర్ధక ఆహారం సరఫరా చేయాలని కేంద్రం పట్టుదలగా ఉంది. రాజస్థాన్, పంజాబ్ దేశ సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.4,406కోట్లు కేటాయించారు. 2,208 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో సరిహద్దు గ్రామాలకు కనెక్టివిటీ పెంచుతారు. హైవేతో అనుసంధానం చేయడం ద్వారా సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తారు.

## ఆర్థిక వనరులు లేకున్నా రుణమాఫీ

- రాజకీయాల్లో భాష సక్రమంగా ఉండాలి
- మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాల్సిందే
- మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ ఆసక్తిక వ్యాఖ్యలు

**హైదరాబాద్, అక్టోబర్ 9 (మనం న్యూస్):** ఆర్థిక వనరులు ఉన్నా లేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాగా పని చేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రుణమాఫీ చేశారని.. రైతు భరోసా కూడా ఇస్తామని ప్రభుత్వం చెప్తోందని.. తొందరగా ఇస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకులు పరుష పదజాలం వాడడం బాధాకరమన్నారు. కొందరు ఇష్టమున్నట్లు మాట్లాడితే తనలాంటి వాడికి ఇబ్బందిగా ఉందన్నారు. సోషల్ మీడియాలో వాడే పదజాలం పద్ధతిగా ఉండాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడకపోవడం ఆయన ఆటిట్యూడ్ అని.. మాట్లాడడం మాట్లాడకపోవడం కేసీఆర్ ఇష్టమని చెప్పుకొచ్చారు. హైడ్రా విషయంలో ప్లస్సా , మైనస్సా అని లెక్కలు వేయొద్దన్నారు. చంద్రబాబు రోడ్లు విస్తరణ వేసేప్పుడు తిట్టారని... రోడ్డు అయ్యాక మెచ్చుకున్నారని గుర్తుచేశారు. మురికిలో బతుకుతున్న వాళ్ళకి మంచి నివాసాలు ఇవ్వడం మంచిదే కదా అని అన్నారు. చెరువుల దగ్గరికి వెళ్లి ఎన్ని ఇండ్లు అక్రమంగా కట్టారో చూడాలన్నారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరైంది కాదని.. పది నెలల నుంచే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉందని చెప్పుకొచ్చారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి ప్రతిపక్షం బాధ్యతగా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కొన్ని విమర్శలు చూస్తే వ్యక్తిగత కక్షతో చేసినట్టు కనిపిస్తోందన్నారు. 88 మంది వచ్చిన వాళ్ళు కూడా పూర్తి కేబినెట్ ఎందుకు వేయలేదని కేసీఆర్‌ను అడగాలన్నారు. సంవత్సరాలు నడిచిన కమిషన్లు, ఎంక్వయిరీ కమిటీలు ఉన్నాయని... మూడు నెలలకే కమిటీ ఏమైంది అనడం హాస్యాస్పదమంటూ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు ఇంత కాస్ట్లీ కావడానికి అన్ని పార్టీలు కారణమన్నారు. 'నువ్వు సుద్ద పూసవైతే ఎదుటివాడ్ని విమర్శించు. టీఆర్ఎస్ పార్టీకి ఖాతా తెరవడానికి డబ్బులు లేకుండే. ఇప్పుడు 1500 కోట్లు ఉన్నాయని వారే ప్రకటించారు. రాజకీయ నాయకుల లూప్ హోల్స్ అధికారులకు తెలుసు. అధికారులు పర్మినెంట్, నేతలు టెంపరరీ' అంటూ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ కామెంట్స్ చేశారు. మరోవైపు శాసనమండలి చీఫ్ విప్‌గా పట్నం మహేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ విప్‌పై మండలి చైర్మన్ పలు వ్యాఖ్యలు చేశారు. మహేందర్ రెడ్డిని బీఆర్ఎస్ విప్‌గా చూడాలా? కాంగ్రెస్ విప్ గా చూడాలా అని మీడియా ప్రశ్నించగా... మహేందర్ రెడ్డిని అఫిషియల్ విప్‌గా చూడాలని మండలి చైర్మన్ తెలిపారు. నేను బీఆర్ఎస్ మండలి చైర్మన్‌ను కాదు.. మండలి చైర్మన్ పదవి తీసుకున్నాక నాకు ఏ పార్టీ ఉండద గుత్త సుఖేందర్ రెడ్డి వెల్లడించారు.

విలువలతో కూడిన వ్యాపారానికి చిరునామాగా నిలిచిన ఓ మహనీయుడిని మన దేశం కోల్పోయింది..

సంపదను సృష్టిస్తూనే... ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవలో తరించిన ఆ జీవితంలో చివరి అధ్యాయం ముగిసింది..

ప్రపంచం మెచ్చిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా ఇకలేరు.

ఎన్నటికీ చెరగని తన ఇంటి పేరును ఈ దేశానికి వదిలేసి... తాను మాత్రం వెళ్లిపోయారు..!

# రతన్ టాటా ఇకలేరు



**ముంబై, అక్టోబరు 9 :** భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసింది! జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామిక వేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్.. రతన్ నావల్ టాటా (86) ఇక లేరు. వంటగదిలో వాడే ఉప్పు నుంచి.. ఆకాశంలో ఎగిరే విమానాల దాకా.. ఎన్నెన్నో ఉత్పత్తులు, సేవలతో భారతీయుల నిత్యజీవితంలో భాగమైన టాటా సామ్రాజ్యాన్ని రెండు దశాబ్దాలపాటు నడిపించిన ఆ పారిశ్రామిక దిగ్గజం.. మరలిరాని లోకాలకు తరలిపోయారు! రక్తపోటు స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడంతో మూడు రోజుల క్రితం ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో చేరిన రతన్ టాటా ఆరోగ్య పరిస్థితి విషమించి.. బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. తన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం కావడంతో.. 'నేను బాగానే ఉన్నా.. ఆందోళన వద్దు' అంటూ ప్రకటన చేసిన మూడురోజులకే ఆయన కన్నుమూశారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెట్జీ టాటాకు ముని మనవడైన రతన్ టాటా 1937 డిసెంబరు 28న ముంబైలో జన్మించారు. తల్లిదండ్రులు సూని టాటా, నావల్ టాటా.. ఆయన పుట్టిన పదేళ్లకు విడిపోవడంతో, రతన్ టాటా తన నాయనమ్మ అయిన నవాజ్బాయ్ టాటా వద్ద పెరిగారు. ముంబై, సిమ్లాల్లో కొంతకాలం చదివిన అనంతరం.. ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం అమెరికాకు వెళ్లారు. అమెరికాలోని రివర్డేల్ కంట్రీ హైస్కూల్లో పట్టా పుచ్చుకున్న అనంతరం కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ అండ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. 1959లో డిగ్రీ పట్టా పుచ్చుకున్న రతన్ టాటా.. 2008లో అదే కార్నెల్ యూనివర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళం ఇచ్చారు. ఆ విశ్వవిద్యాలయ చరిత్రలోనే అతిపెద్ద అంతర్జాతీయ దాతగా నిలిచారు. అమెరికాలో పట్టభద్రుడైన అనంతరం.. 1961లో ఆయన టాటా గ్రూపులో చేరారు. తొలుత టాటా స్టీల్లో చిరుద్యోగిగా చేరిన ఆయన గ్రూపులోని వివిధ కంపెనీల్లో విభిన్న హోదాల్లో పనిచేశారు. 1971లో నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ డైరెక్టర్ ఇన్చార్జిగా.. 1981లో టాటా ఇండస్ట్రీస్ చైర్మన్‌గా.. ఇలా



పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే విద్యార్థిలాగా నిరంతరం ఏదో ఒకటి నేర్చుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలోనే 1975లో అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ పూర్తిచేశారు. 1991లో జేఆర్డీ టాటా అనంతరం టాటా సన్స్ చైర్మన్‌గా పగ్గాలు చేపట్టి.. 2012 డిసెంబరు 28వ తేదీన రిటైరయ్యేదాకా సంస్థను సమర్థంగా నడిపారు. ఆ తర్వాత మళ్లీ 2016 అక్టోబరు నుంచి 2017 ఫిబ్రవరి దాకా తాత్కాలిక చైర్మన్‌గా ఉన్నారు. 1991లో ఆయన పగ్గాలు చేపట్టే సమయానికి టాటా గ్రూప్‌లో ఉన్న కంపెనీల సంఖ్య దాదాపు 250 దాకా ఉండేది. కానీ, ఆయన వాటిని 98కి తగ్గించి సంస్థ సామర్థ్యాన్ని పెంచారు. టాటా గ్రూపు.. హై టెక్నాలజీ వ్యాపారాల్లో ప్రవేశించేందుకు బీజం వేశారు. టాటా గ్రూప్ ఆయన హయాంలోనే 10 వేల కోట్ల డాలర్ల వ్యాపార సామ్రాజ్యంగా అవతరించింది. తన సమర్థ నాయకత్వంలో ఆయన టాటా మోటార్స్, టాటా స్టీల్, టీసీఎస్, టాటా పవర్, టాటా గ్లోబల్ బెవరేజెస్, టాటా కెమికల్స్, ఇండియన్ హోటల్స్, టాటా టెలీ సర్వీసెస్ సంస్థలను అగ్రశ్రేణి సంస్థలుగా తీర్చిదిద్దారు. టీసీఎస్‌ను.. దేశంలో వెయ్యికోట్ల డాలర్ల వార్షిక ఆదాయం మైలురాయి దాటిన తొలి భారత ఐటీ కంపెనీగా నిలిపారు. వ్యాపారవేత్తగానే కాదు.. తన ఆదాయంలో 60 నుంచి 65 శాతం మేర వివిధ దాతృత్వ కార్యక్రమాలకు కోసం ఉదారంగా ఇచ్చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. భారత ప్రభుత్వం ఆయనను 2000 సంవత్సరంలో పద్మభూషణ్‌తో, 2008లో పద్మవిభూషణ్‌తో గౌరవించింది. మరెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను, గౌరవ డాక్టరేట్లను రతన్ టాటా అందుకున్నారు.

## బహుముఖ విస్తరణ

రతన్ టాటా హయాంలో టాటా గ్రూపు దేశ, విదేశాల్లో అనేక కొత్త వ్యాపారాల్లోకి విస్తరించింది. అన్నిటి కంటే ముఖ్యంగా 'ఇండికా' కారును దేశీయంగా అభివృద్ధి చేయడం ద్వారా, భారత ఆటోమొబైల్ కంపెనీలకు సొంతంగా కార్లను అభివృద్ధి చేసే సత్తా లేదన్న ప్రచారానికి ఆయన తెరదించారు. నానో కారు ద్వారా రతన్ టాటా లక్ష రూపాయలకే మిడిల్ క్లాసుకు సొంత కారు భాగ్యం కల్పించారు. అలాగే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న బ్రిటిష్ లగ్జరీ కార్ల కంపెనీ జాగ్వార్, ల్యాండ్ రోవర్ను కొనుగోలు చేయడం ద్వారా, టాటా మోటార్స్ కంపెనీని అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చి దిద్దారు. బ్రిటన్‌కు చెందిన టెట్లీ టీ బ్రాండ్ కొనుగోలు రతన్ టాటా హయాంలోనే జరిగింది. టాటా స్టీల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా విస్తరించడంతో పాటు, బ్రిటిష్ స్టీల్ కంపెనీని కొనుగోలు చేసి, టాటా స్టీల్ కంపెనీ కార్యకలాపాలను యూరప్‌కూ విస్తరించారు. ఆయన ప్రారంభించిన వ్యాపారాల్లో నానో కారు, టెలికం వెంచర్లు మాత్రమే అంతగా కలిసి రాలేదు.

## సైరస్ మిస్త్రీతో వైరం

తన తర్వాత టాటా గ్రూప్‌ను సమర్థుడైన వారసునికి అప్పగించాలన్న ఆలోచనతో సైరస్ మిస్త్రీని ఆ పదవికి ఎంపిక చేశారు. కాని వారి బంధం ఎంతో కాలం కొనసాగలేదు. ఆర్థికంగా కంపెనీకి గుది బండలా మారిన 'నానో' కారు ప్రాజెక్టు ఆపేయాలని మిస్త్రీ చేసిన ప్రయత్నాలకు రతన్ టాటా అడుగడుగునా అడ్డుతగిలారు. తన మానస పుత్రిక అయిన నానో ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో ఆపకూడదని రతన్ పట్టుబట్టడం వల్లే, మిస్త్రీ టాటా గ్రూప్‌కు దూరమయ్యారని చెబుతారు. టాటా గ్రూప్ చరిత్రలో మొదటిసారిగా పార్సీయేతర వ్యక్తి ఎన్ చంద్రశేఖరన్ టాటా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం వెనక రతన్‌టాటా మద్దతు ఉంది.

## 50కి పైగా స్టార్టప్‌ల్లో పెట్టుబడులు


రతన్ టాటా సమర్థుడైన పారిశ్రామికవేత్త మాత్రమే కాదు.. తెలివైన పెట్టుబడిదారుడు కూడా. యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించే విషయంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. వ్యక్తిగత హోదాలో ఆయన పేటీఎం, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్ సహా 50కి పైగా స్టార్టప్‌ల్లో ఆయన ఇన్వెస్ట్ చేశారు. అవన్నీ అద్భుత విజయాలు సాధించిన సంస్థలే!

## ఎయిరిండియా కొనుగోలు

టాటా గ్రూప్ నుంచి ప్రభుత్వ పరమైన ఎయిరిండియాను మళ్లీ టాటాల పట్టులోకి తేవాలన్నది రతన్ టాటా చిరకాల వాంఛ. ఇందుకు అడ్డంకులు ఎదురవడంతో సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్‌తో కలిసి విమానయాన రంగంలోకి ప్రవేశించారు. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు అడ్డంకులు తొలగడంతో 2022లో ఆ సంస్థను మళ్లీ టాటా గ్రూప్ కొనుగోలు చేసింది. పీకల్లోతు నష్టాలతో ఉన్న ఎయిరిండియాను కొనేందుకు ఏ ప్రైవేటు సంస్థా ముందుకు రాలేదు. అయినా తమ గ్రూప్ వ్యవస్థాపకుడు జేఆర్డీ టాటా ప్రారంభించిన ఎయిర్ ఇండియాను మళ్లీ తమ పట్టులోకి తేవాలనే ఏకైక లక్ష్యంతోనే ఎయిర్ ఇండియాను రతన్ టాటా కొనుగోలు చేశారు. ఇపుడు ఈ సంస్థ అన్ని బాలారిష్టాలను అధిగమిస్తూ పెద్ద ఎత్తున విస్తరణకు సిద్ధమైంది.

## టాటా వారసులెవరు?

రతన్ టాటా మరణంతో ఈ సామ్రాజ్యం పగ్గాలు చేపట్టేందుకు అవకాశాలు, అర్హతలున్న టాటా కుటుంబ వారసుల జాబితాలో నోయెల్ టాటా పేరు ప్రధానంగా చెప్పుకోవాలి. రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా. గ్రూప్ రిటైల్ వర్తక విభాగమైన ట్రెంట్‌తోపాటు పలు వ్యాపారాల్లో ప్రస్తుతం ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. నోయెల్ సంతానమైన మాయ, నెవిల్లే, లేహ్ టాటా సైతం పలు టాటా కంపెనీల్లో



మేనేజ్మెంట్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## మధ్య తరగతి కారు కల నానో

కారులో ప్రయాణించాలనే భారతీయ మధ్య తరగతి కుటుంబాల కల నెరవేర్చాలని దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా సంకల్పించారు. ఆయన ఈ సంకల్పమే 'నానో' కారు రూపకల్పనకు దారితీసింది. ఈ కారును 2008లో మార్కెట్లోకి తెచ్చారు. కేవలం రూ. 1,00,000 ధరే నిర్ణయించి ప్రపంచంలోనే చౌకైన కారుగా ప్రకటించారు. ఇలా అప్పటికి ధనిక వర్గాలకే పరిమితం అయిన కారును మధ్య తరగతి ప్రజలకూ అందుబాటులోకి తెచ్చి వారి కల నెరవేర్చారు. ఈ కారు బయటకు వచ్చాక ఆరంభ కష్టాలు ఎదుర్కొన్నా... ఆటోమొబైల్ మార్కెట్లో సంచలనం సృష్టించింది. ఆటోమొబైల్ పరిశ్రమ కేవలం ఉన్నత వర్గాల కోసమే కార్లను తయారుచేయడం కాకుండా మధ్య తరగతి, దిగువ వర్గాలనూ దృష్టిలో ఉంచుకుని వాహనాలను తయారుచేయాలన్న చర్చకు దారితీసింది. ఈ విషయంలో రతన్ టాటా విజన్ స్పష్టంగా ఉంది... అదేమిటంటే మధ్య తరగతి స్థోమతకు తగ్గ కారును వారి ముందుంచడం... 'నానో'తో ఆయన అది పూర్తిచేశారు.




రతన టాటా మరణంతో భారత్ ఓ గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. దాతృత్వం, సేవా కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం నిరుపమానం.

**– ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి**

రతన్ టాటా దార్శనిక వ్యాపారవేత్త. దయార్ధ హృదయుడు. మానవీయత మూర్తీభవించిన అసాధారణ మనిషి. సమాజాన్ని మెరుగుపరిచేందుకు నిరంతరం యత్నించారు.

**– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

వ్యాపార రంగంలో రతన్ టాటా పాటించిన విలువలు, సామాజిక సంక్షేమం కోసం ఆయన పడిన తపన స్ఫూర్తిదాయకం. సేవకు ఆయన ప్రతిరూపం.

**– రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం**

వ్యాపార దిగ్గజాన్నే కాదు గొప్ప మానవతావాదిని కూడా కోల్పోయాం. రతన్ టాటా దార్శనికత, సమైక్య భావనతో ఈ ప్రపంచంలో తమదైన ముద్ర వేశారు.

**– నారా చంద్రబాబు నాయుడు, ఏపీ సీఎం**

దిగ్గజ పారిశ్రామికవేత్త, నిజమైన జాతీయవాది. దేశ అభివృద్ధి కోసం ఆయన నిస్వార్థంగా అంకితమయ్యారు. మెరుగైన భారత్ కోసం ఆయన నిరంతరం తపనపడేవారు.

**– అమిత్ షా, కేంద్ర హోం మంత్రి**

రతన్ దార్శనికత ఉన్న మనిషి. వ్యాపారంలోనూ, దాతృత్వంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు.

**– రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత**

ఆధునిక భారత్‌కు బాటలు పరిచిన దార్శనికుడు. రతన్ టాటా కేవలం వ్యాపారవేత్త కాదు. భారత సమగ్రతను నిలువెల్లా నింపుకున్న దిగ్గజం.

**– గౌతం అదానీ, పారిశ్రామికవేత్త**

రతన్ టాటా మార్గదర్శకత్వం వెలకట్టలేనిది. మహనీయులకు మరణం లేదు.

**– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త**

## రతన్ టాటా విఫల ప్రేమగాథ!

వ్యాపార దిగ్గజంగా ఎన్నో విజయాలు సాధించిన రతన్ టాటా కూడా ఎంతోమందిలా ఓ లవ్ ఫెయిల్యూరే.. 1962లో భారత్, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధం రతన్ టాటా ప్రేమ విఫలం కావడానికి కారణమైంది. రతన్ టాటా 25 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు చదువు పూర్తి చేసుకుని అమెరికాలోని లాస్‌ఏంజెల్స్లో ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో అక్కడి ఓ మహిళతో ప్రేమలో పడ్డారు. ఆమెను పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో ఏడేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నాయనమ్మతో కొద్ది రోజులు గడపడం కోసం ఆయన స్వదేశానికి వచ్చారు. తన కోసం తన ప్రేయసి కూడా భారత్ వస్తుందని ఆశించారు. కానీ, భారత్– చైనా యుద్ధంతో ఆ మహిళ తల్లిదండ్రులు ఆమె భారత్ వెళ్లేందుకు అంగీకరించలేదు. దీంతో వారి ప్రేమకథ ముగిసింది. ఈ తొలి ప్రేమ ఆయనకు ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది. తన ప్రేమకథను పలుమార్లు బయటపెట్టిన రతన్ టాటా ఆ మహిళ ఎవరనేది ఎప్పుడూ చెప్పలేదు. ఆ తర్వాత 1970ల్లో హిందీ చిత్రసీమలో ప్రముఖ నటీమణిగా వెలుగొందిన సిమీ గరేవాల్కు రతన్ దగ్గరయ్యారు. వారి అనుబంధం పెళ్లిపీటల వరకు వెళుతుందని ఆశించినా అది జరగలేదు. సిమీ మరొకరిని పెళ్లాడగా రతన్ టాటా ఒంటరయ్యారు. ఇలా మొత్తం నాలుగు సందర్భాల్లో ఆయన పెళ్లి పీటలు ఎక్కేందుకు సిద్ధమైనా వేర్వేరు కారణాలతో అవేవి జరగక ఆజన్మబ్రహ్మచారిగానే ఉండిపోయారు.









# కాంగ్రెస్‌వన్నీ విభజన రాజకీయాలు

**ముంబయి, అక్టోబర్ 9 :** సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ.. హిందువులను విభజించాలని చూస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ తీరును విమర్శిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణా ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు, దళితులు బీజేపీకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు బీజేపీను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారని మోదీ అన్నారు. హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రజల్లో తమను తప్పుగా చూపించడానికి ఎన్నో కథనాలు రచించి.. ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. సమాజాన్ని నాశనం చేయడానికి పూనుకున్న ఈ శక్తులన్నింటికీ రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన సమాధానం ఇస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు బీజేపీమహాయుతి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఖండించారు. ప్రధాని రాజకీయ ప్రసంగాల కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ఎందుకు ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రసంగాల కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయకుండా బీజేపీ సొంత సొమ్ముతో వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## హర్యానా ఫలితాలను విశ్లేషిస్తున్నాం

మొదటి పేజీతరువాయి...

ఆ పార్టీ అనుమానాలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ హరియాణాలో పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. ఇక హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. హరియాణాలో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల గళాన్ని మేం వినిపిస్తూనే ఉంటాం అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. హరియాణాలో వరుసగా మూడోసారి బీజేపీ విజయం సాధించింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో 90 సీట్లకు గానూ 48 చోట్ల జయకేతనం ఎగురవేసింది. ఉదయం కౌంటింగ్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు కనిపించింది. గంట తర్వాత క్రమంగా ఫలితాలు తారుమారవడం ప్రారంభించి చివరకు బీజేపీ విజయం సాధించింది. కాంగ్రెస్ 37 సీట్ల వద్దే ఆగిపోయింది. కొన్నిచోట్ల మెజారిటీలు అత్యల్పంగా నమోదవడంతో రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా స్వల్పంగానే ఉంది. దీంతో ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈసీ పనితీరుతో పాటు ఈవీఎంల పైనా ఆరోపణలు చేశారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. కూటమిలోని ఎన్సీ 42, కాంగ్రెస్ 6, సీపీఎం 1 సీటును గెలుచుకున్నాయి. బీజేపీ 29 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది.

## ఆ ఈవీఎంలపై అనుమానాలున్నాయ్

### ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపు సందర్భంగా కొన్ని ఈవీఎంలలో వ్యత్యాసాలను గుర్తించాలని, వాటిపై దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అటువంటి ఈవీఎంలను సీల్ చేసి దర్యాప్తు సమయంలో వాటిని భద్రపరచాలని పేర్కొంది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం సమావేశమైంది. హరియాణాలో వివిధ నియోజకవర్గాల్లో వచ్చిన పలు ఫిర్యాదులను ఈసీకి కాంగ్రెస్ నేతలు విన్నవించారు. ముఖ్యంగా కొన్ని ఈవీఎంలు 90శాతం బ్యాటరీతో ఉండగా.. మరికొన్ని 60 నుంచి 70శాతం ఉండటాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో వ్యత్యాసాలున్నాయని అనుమానం వ్యక్తం చేస్తూ.. వీటిపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ బృందం ఫిర్యాదు పత్రాలు అందజేసింది. తాము పేర్కొన్న అంశాలను పరిశీలిస్తామని ఈసీ హామీ ఇచ్చినట్లు హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడ్డా మీడియాతో పేర్కొన్నారు. ఇటువంటి ఫిర్యాదులకు సంబంధించి రానున్న రోజుల్లో మరిన్ని అంశాలను ఈసీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈసీ ఉన్నతాధికారులతో సమావేశమైన వారిలో అశోక్ గహ్లోత్, ఏఐసీసీ నేతలు కేసీ వేణుగోపాల్; జైరాం రమేశ్, అజయ్ మాకెన్, పవన్ ఖేడాతోపాటు పలువురు హరియాణా కాంగ్రెస్ నేతలు ఉన్నారు. సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ ఆన్లైన్లో హాజరయ్యారు.

మనం



# బంగ్లాపై భారత్ భారీ విజయం




## నితీశ్ సూపర్ షో
### ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విజృంభణ
### సిరీస్‌లో 2-0తో ముందంజ

టీమ్ఇండియా యువ క్రికెటర్లు దుమ్ము రేపుతున్నారు. బుధవారం జరిగిన రెండో టీ20లో టీమ్ఇండియా 86 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తుగా ఓడించింది. భారత్ నిర్దేశించిన 222 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో 9 వికెట్లు కోల్పోయి 135 పరుగులకు పరిమితమైంది. మహ్మదుల్లా(41) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. వరుణ్ చక్రవర్తి(2/19), నితీశ్‌కుమార్(2/23) రెండేసి వికెట్ల తీశారు. అంతకుముందు నితీశ్(34 బంతుల్లో 74, 4ఫోర్లు, 7 సిక్సులు), రింకూ సింగ్(29 బంతుల్లో 53, 5ఫోర్లు, 3 సిక్సులు) సూపర్ అర్ధ సెంచరీలతో టీమ్ ఇండియా 20 ఓవర్లలో 221/9 స్కోరు చేసింది. రిషాద్ హుస్సేన్(3/55) మూడు వికెట్లు పడగొట్టాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన నితీశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఈనెల 12న హైదరాబాద్ మూడో టీ20 మ్యాచ్ జరుగుతుంది. నితీశ్, రింకూ అదుర్స్ : తొలుత టాస్ గెలిచిన బంగ్లా.. భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. మెహదీ హసన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ వరుస బంతుల్లో శాంసన్(10) రెండు ఫోర్లు కొట్టి దూకుడుగా ప్రారంభించాడు. అయితే ఆ మరుసటి ఓవర్ ఆఖరి బంతికి షాట్ ఆడబోయిన శాంసన్.. శాంతోకు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. తంజిమ్ మూడో ఓవర్లో వరుస ఫోర్లతో జోరు మీద కనిపించిన అభిషేక్‌శర్మ(15).. చివరి బంతికి క్లీన్‌బౌల్ అయ్యాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. నితీశ్‌కుమార్ సంయమనం పాటించాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన ముస్తాఫిజుర్.. కెప్టెన్ సూర్యకుమార్(8)ను స్లో బాల్‌తో బోల్తా కొట్టించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 3 కీలక వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. ఈ సమయంలో నితీశ్, రింకూసింగ్.. ఇన్నింగ్స్ బాధ్యతను భుజానెత్తుకున్నారు. కెరీర్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న నితీశ్ మంచి పరిణతి కనబరిచాడు. రిషాద్ వేసిన 10వ ఓవర్లో నితీశ్ కండ్లు చెదిరే సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. తానేం తక్కువ కాదన్నట్లు మరో ఎండ్లో రింకూ కూడా చెలరేగడంతో 10 ఓవర్లకు భారత్ 101/3 స్కోరుకు చేరుకుంది. బౌలర్ ఎవరన్నది లెక్క చేయకుండా చెలరేగిన నితీశ్ 27 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన మెహదీని నితీశ్ గట్టిగా అరుసుకున్నాడు. మూడు భారీ సిక్స్‌లకు తోడు ఓ ఫోర్‌తో 26 పరుగులు పిండుకున్నాడు. ముస్తాఫిజుర్ వేసిన మరుసటి ఓవర్‌లో 73 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద నితీశ్ వెనుదిరిగాడు. దీంతో నాలుగో వికెట్‌కు 108 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు నితీశ్ ఔటైనా.. హార్దిక్‌తో కలిసి రింకూ తన జోరు కొనసాగించాడు. ఈ క్రమంలో ఓ భారీ సిక్స్‌లతో అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్న రింకూ తస్కిన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత రియాన్ పరాగ్(15), హార్దిక్(32), వరుణ్(0), అర్షదీప్ సింగ్(0) వెంటవెంటనే ఔటయ్యారు.

బంగ్లా ఢమాల్ : భారీ లక్ష్యఛేదన లో బంగ్లా ఆది నుంచే తడబాటుకు గురైంది. అర్షదీప్ మూడో ఓవర్లో పర్వేజ్ హుసేన్(16) తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ శాంతో(11).. సుందర్‌కు వికెట్ ఇచ్చుకోగా, లిటన్ దాస్(14)ను వరుణ్ క్లీన్‌బౌల్ చేశాడు. దీంతో పవర్‌ప్లే పూర్తయ్యే సరికి బంగ్లా 43/3 స్కోరు చేసింది. ఇలా వరుస విరామాల్లో బంగ్లా వికెట్లు కోల్పోతూ వచ్చింది. మిడిలార్డర్లో మహ్మదుల్లా ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయింది.

## గెలిచి నిలిచారు..

- హర్మన్‌ప్రీత్, మంధన అర్ధసెంచరీలు
- శ్రీలంకపై భారత్ ఘన విజయం
- సెమీస్ రేసులోకి టీమ్ఇండియా





టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫెవరేట్లలో ఒకటైన భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. మెగాటోర్నీలో నిలువాలంటే భారీ తేడాతో గెలువాల్సిన స్థితిలో అదరగొట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 82 పరుగుల తేడాతో లంకపై ఘన విజయం సాధించింది. దీంతో 0.576 రన్‌రేట్‌తో గ్రూపు-ఏలో ఆస్ట్రేలియా(2.52) తర్వాత స్థానంలో కొనసాగుతున్నది. తొలుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(27 బంతుల్లో 52 నాటౌట్, 8ఫోర్లు, సిక్స్), స్మ ృతి మందన(38 బంతుల్లో 50, 4ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో భారత్ 20 ఓవర్లలో 172/3 స్కోరు చేసింది. ఆటపట్టు, కాంచన ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన లంక..19.5 ఓవర్లలో 90 పరుగులకు ఆలౌటైంది. కవిశ(21), అనుష్క (20)టాప్ స్కోరర్లుగా నిలిచారు. అరుంధతిరెడ్డి(3/19), ఆశా శోభన(3/19) మూడేసి వికెట్లు తీశారు. ధనాధన్ అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన హర్మన్‌ప్రీత్ కౌర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. మందన, కౌర్ దూకుడు: కచ్చితంగా భారీ విజయం సాధించాల్సిన పరిస్థితుల్లో మందన, హర్మన్‌ప్రీత్ అద్భుత ఆటతీరు ప్రదర్శించారు. ఓపెనర్లు షెఫాలీవర్మ, మందన దూకుడైన బ్యాటింగ్‌తో జట్టుకు మెరుగైన శుభారంభం అందించారు. దీంతో వవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ కోల్పోకుండా 41 పరుగులు చేసింది. మధ్యలో కొంత ఆట నెమ్మదించినా.. వీరిద్దరు వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. అయితే వరుస బంతుల్లో వీరు ఔట్ కావడం ఒకింత ఆందోళన కల్గించినా.. కౌర్ వచ్చి రావడంతోనే బ్యాటు ఝులిపించింది. లక్ష్యఛేదనలో లంక ఏమాత్రం పోరాటపటిమ కనబర్చలేక పోయింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ధాటికి లంక వరుసగా వికెట్లు కోల్పోయింది.

## దయ్యం వెంటాడుతుంది



దాదాపు 17 ఏళ్ల విరామం తర్వాత 'భూల్ భూలయ్యా 3' ఫ్రాంఛైజీలో భాగమైంది కథానాయిక విద్యాబాలన్. కార్తిక్ ఆర్యన్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ హారర్ కామెడీ చిత్రం నవంబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. విద్యాబాలన్, మాధురీ దీక్షిత్ ప్రధాన పాత్రల్ని పోషించారు. బుధవార ట్రైలర్‌ను విడుదల చేశారు. జైపూర్‌లో నిర్వహించిన ఈ వేడుకలో మాట్లాడిన విద్యాబాలన్ ఆసక్తి కరమైన వ్యాఖ్యలు చేసింది. సుదీర్ఘ విరామం తర్వాత తాను ఈ ప్రాజెక్ట్‌లోకి రావడం ఆనందంగా ఉందని చెప్పింది. ఆమె మాట్లాడుతూ 'తొలి రెండు భాగాలకు సంబంధించిన షూటింగ్ ఎక్కువగా జైపూర్‌లోనే షూట్ చేశారు. అలా ఈ నగరంతో ఎంతో అనుబంధం ఏర్పడింది. అందుకే ఈ ట్రైలర్ ఇక్కడ విడుదల చేశాం. తప్పకుండా మీరందరూ ఈ సినిమా చూడండి. లేకపోతే సినిమాలోని దయ్యం పాత్ర మంజులిక మిమ్మల్ని రాత్రిళ్లు వెంటాడుతుంది. మీకు నిద్ర కరువవుతుంది' అంటూ సరదా మాటలతో నవ్వుల్ని పంచింది. ఈ సినిమాలో కీలకమైన మంజులిక అనే దెయ్యం పాత్రలో విద్యాబాలన్ నటించింది. ఆద్యంతం కామెడీ, హారర్ అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది. 2022లో విడుదలైన 'భూల్ భూలయ్యా-2' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది.

## 'డియర్ జిందగీ' అవకాశం కత్రినాదే కానీ..!





'డియర్ జిందగీ'.. జీవితం ఎంత గొప్పదో తెలియజేసే సందేశాత్మక చిత్రమిది. బాలీవుడ్ కథానాయకుడు షారుక్ ఖాన్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను గౌరీ షిండే తెరకెక్కించారు. ఇందులో కైరా పాత్రలో అలియా, సైకాలజిస్టు పాత్రలో షారుక్ ఒదిగిపోయారు. ఇందులోని పేషెంట్, డాక్టర్ మధ్య భావోద్వేగ సన్నివేశాలు మనసుల్ని హత్తుకున్నాయి. కానీ.. ముందుగా ఈ చిత్రంలో కథానాయికగా అందాల తార కత్రినా కైఫ్‌ను ఎంపిక చేసుకున్నారట దర్శకుడు. ఆ తరవాత అనుకోని కారణాల వల్ల ఆ స్థానంలో తను నటించాల్సి వచ్చిందని అలియానే స్వయంగా ఓ సందర్భంలో పంచుకుంది. ''ఈ సినిమాకు నేను ఫస్ట్ ఛాయిస్ కాదనే విషయం చాలా తక్కువ మందికి తెలుసు. నేను ఇందులో చిన్న అమ్మాయిగా కనిపిస్తానని దర్శకురాలు షారుక్తో నటించడానికి అంగీకరించలేదు. ఏమయ్యిందో తెలియదు కానీ.. ఓ రోజు గౌరీ నా దగ్గరికి వచ్చి ఇందులో నటించమని అడిగింది. కొన్ని రోజుల తర్వాత కరణ్ జోహార్, షారుక్.. నన్ను ఈ చిత్రంలో కథానాయికగా తీసుకోమని గౌరీని ఒప్పించారని తెలిసింది. అలా నేను షారుక్‌తో నటించే అవకాశాన్ని దక్కించుకున్నాన''ని అప్పటి విశేషాలను గుర్తు చేసుకుంది అలియా.

## పతాక ఘట్టాల్లో 'వార్-2'



హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటిస్తున్న 'వార్-2' చిత్రం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ యాక్షన్ చిత్రం ద్వారా ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ దర్శకుడు. యష్‌రాజ్ ఫిలింస్ బాక్‌బస్టర్ 'వార్'కి సీక్వెల్‌గా తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. నవంబర్‌లో క్లైమాక్స్ ఘట్టాల చిత్రీకరణకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దాదాపు 30 రోజుల పాటు జరిగే ఈ షూట్‌లో యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. ఇప్పటివరకు భారతీయ సినిమాలో చూపించని విధంగా ఇన్నోవేటివ్ యాక్షన్ సీక్వెన్స్ డిజైన్ చేస్తున్నారని, తొలిభాగం కంటే ఇంటెన్స్‌గా పోరాట ఘట్టాలు ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. ఈ ఎపిక్ క్లైమాక్స్ ఎపిసోడ్ కోసం కథానాయకులు హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారని, స్టైంత్ ట్రెయినింగ్, స్పీడ్ బేస్డ్ ఎక్స్‌క్లూజ్‌లపై దృష్టి పెడుతున్నారని చిత్ర బృందం పేర్కొంది. విదేశాల్లో చిత్రీకరించే ఈ యాక్షన్ ఎపిసోడ్ ఇండియన్ స్క్రీన్‌పై మెమొరబుల్‌గా నిలిచి పోతుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశా!




కథానాయిక సంయుక్త మీనన్ తొలిసారి మహిళా ప్రధాన కథాంశంలో నటిస్తున్నది. ఆమె ప్రధాన పాత్రలో హాస్య మూవీస్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. యోగేష్ కేఎంసీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సంయుక్తమీనన్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రానా దగ్గుబాటి క్లాప్‌నివ్వగా అగ్ర నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సింగిల్ సిట్టింగ్‌లో సంయుక్తమీనన్ ఈ కథ ఓకే చేసింది. అంతలా ఆమెకు ఈ స్టోరీ నచ్చింది' అన్నారు. 'ఇలాంటి స్క్రిప్ట్ దొరకడం నా అదృష్టం. ఈ సినిమాకు ఫీమేల్ సెంట్రిక్ మూవీ అనే ముద్ర వేయలేం. బలమైన మహిళా ప్రధాన పాత్రతో ఆకట్టుకునే కథ. సామాజిక, రాజకీయ అంశాల ప్రస్తావన కూడా ఉంటుంది. కండబలం అవసరం లేకుండానే స్త్రీ తనదైన రీతిలో దుష్టశిక్షణ చేసే మార్గం ఉంది. ఈ కథ అదే విషయాన్ని చర్చిస్తుంది' అని సంయుక్తమీనన్ చెప్పింది. తమ సంస్థ నిర్మిస్తున్న ఆరో చిత్రమిదని, యాక్షన్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుందని నిర్మాత రాజేష్ దండా తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాణం: హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ఆర్ట్: బ్రహ్మ కడలి, సమర్పణ: సంయుక్త మీనన్, రచన-దర్శకత్వం: యోగేష్ కేఎంసీ.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.